# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 150 | హైదరాబాద్ | సోమవారం 01-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

సచిన్ రికార్డు బద్దలు కొట్టిన కోహ్లీ... గవాస్కర్ స్పందన

## తెలంగాణ
# పంచాయతీ ఎన్నికలు

తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు 11లో

- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ





11లో

## టీజీఎస్ఆర్టీసీ..
# ప్రయాణికులకు గుడ్ న్యూస్

**60 రోజుల ముందే టికెట్ బుకింగ్!**

- పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులకు వెసులుబాటు
- ఇప్పటికే ఉన్న సదుపాయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయం
- ఏసీ, స్లీపర్ బస్సులను పెంచుతున్న ఆర్టీసీ


11లో

## కొండగట్టులో
# భారీ అగ్నిప్రమాదం

- కొండగట్టు వద్ద గత రాత్రి భారీ అగ్నిప్రమాదం
- 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం
- సమ్మక్క జాతర కోసం నిల్వ ఉంచిన సరుకు బూడిద
- కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగిందని అంచనా
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమిక నిర్ధారణ

## భారత క్రీడారంగానికి
# ఇది 'సూపర్ హిట్' నెల

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

- మహిళల క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్‌ల విజయాలపై ప్రత్యేక అభినందనలు
- అంధుల మహిళా క్రికెట్ జట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందన్న ప్రధాని
- డెఫ్లింపిక్స్, వరల్డ్ బాక్సింగ్‌లోనూ పతకాల పంట పండించిన భారత క్రీడాకారులు


11లో

## వర్షంలోనూ తిరుమలకు
# పోటెత్తిన భక్తులు..

సర్వదర్శనానికి 15 గంటల సమయం


11లో

- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- 14 కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తజనం
- దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షా లను లెక్కచేయని భక్తులు
- శనివారం హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

# భోగాపురం విమానాశ్రయం సిద్ధం..

వచ్చే నెలలో ఎగరనున్న తొలి విమానం!


11లో

- టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- డిసెంబర్ చివరిలో లేదా జనవరిలో తొలి విమానం ఎగిరే అవకాశం
- ఇప్పటికే 92 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు

## 'పేదల సేవలో' కార్యక్రమంలో
# అందరూ పాల్గొనాలి..


11లో

- నిరంతరం ప్రజల్లో ఉండాలని హితవు
- ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న టీడీపీ అధినేత
- పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలన్న చంద్రబాబు

భారత శక్తి

# కన్నడలో కుర్చీలాట..

కర్ణాటక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మొన్నటిదా కా అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని అటు సీఎం సిద్ధరామయ్య.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గంభీరంగా పేర్కొన్నప్పటికీ లోలోపల మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. హైకమాండ్ మాటకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్న డీకే శివ కుమార్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడ మే ప్రపంచంలో పెద్ద శక్తి' అని ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా సిద్ధరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారుఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. 2023లో కర్ణాటకకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి మించి 23 సీట్లు అధికంగా సాధించి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి సిద్ధరామయ్యతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడైన డీకే శివకుమార్ శక్తికి మించి పనిచేశారు. దీంతో ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు పూర్తి కాగానే అధికార మార్పిడి జరగాలని ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు సిద్ధరామయ్య ఈ ఏడాది నవంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆ తర్వాత సీఎం పగ్గాలను డీకేకు అప్పగించాలికానీ సిద్ధరామయ్య పార్టీ కేంద్ర నాయకత్వంతో భేటీ అయ్యి ఐదేళ్లు తానే సీఎంగా ఉండేలా అనుమతులు తెచ్చుకోవడంలో తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇదే సమయంలో డిప్యూ టీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ కూడా సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపించింది. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే పాత్ర మరువలేనిది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోయి సమన్వయంతో వ్యవహరించి పార్టీని విజయపథంలో నడిపించారు. అయితే అపార పరిపాలన అనుభవం కలిగిన సిద్ధరామయ్యకే సీఎం పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం మొగ్గుచూపింది. హైకమాండ్ ఆదేశాలను తాను శిరసావహిస్తానని డీకే చెప్పడంతో సమస్య చల్లబడినట్లుగా అనిపించింది. ఈ నవంబర్ 20తో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి కావడంతో అధికార మార్పిడి అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. శివకుమార్‌ను పొలిటికల్ మాస్టర్ మైండ్‌గా అభివర్ణించినప్పటికీ.. పాలన విషయంలో సిద్ధరామయ్య ఒక మెట్టు ముందు ఉంటారు. జనతాదళ్ నుంచి బహిష్కరణకు గురై 2006లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సిద్ధరామయ్య పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య , డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం. నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ సోమవారం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు. 2013లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంతో పాటు సీఎంగా ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపించారు. ఇటు సిద్ధూ.. అటు డీకేల్లో ఉన్న ప్రత్యేక లక్షణాలే ఇవాళ హైకమాండ్‌కు సీఎం మార్పు తలనొప్పిగా మారిపోయింది. 2006లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పాలనా ఒప్పందంలో భాగంగా రెండున్నరేళు పూర్తయిన తర్వాత జేడీఎస్ అధినేత కుమారస్వామి అయిష్టంగానే సీఎం పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు బీఎస్ యడ్యూరప్పకు అప్పగించారు. ప్రస్తుతానికి సీఎం సిద్ధరామయ్య పదవికి ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్టంలో ఓబీసీలదే రాజ్యమని కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసని నివేదికలు చెబుతున్నాయి ఆయనకు అహింద వర్గంతో పాటు పార్టీలోని 100 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సభలో మొత్తం 137 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య అంగీకారం లేకుండా ముఖ్యమంత్రిని మార్చడం అనేది చాలా కష్టం. కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల సమాఖ్య కాంగ్రెస్‌ను హెచ్చరించింది. రాష్ట్ర యూనిట్‌లో అంతర్గత కలహాల నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించడానికి ఏ ప్రయత్నం చేసినా అది పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. మరోవైపు కర్ణాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్న ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు అన్యాయం జరిగితే.. వారు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించింది. ముఖ్యమంత్రిని మార్చాలని సిద్ధరామయ్య వర్గంపై ఒత్తిడి తెస్తే వారు అధిష్ఠానానికి పేర్ల జాబితాను సమర్పిస్తారని గత కొద్ది రోజులుగా మీడియా నివేదికలలో వెల్లడైంది. ఇందులో ఓ ప్రత్యామ్నాయంగా హోంమంత్రి జి. పరమేశ్వర్ పేరు ఉ ండవచ్చు.

# తిరుమలలో ఏం జరుగుతోంది..

తిరుమల,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ఆ రెండు కేసులు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తున్నాయ్. కోట్లాది మంది భక్తుల విశ్వాసం..భక్తుల కొంగుబంగారంగా ఉన్న తిరుమల శ్రీవారి..కొండ చుట్టూ తిరుగుతున్న ఆ రెండు ఇష్యూస్‌పై రచ్చ కంటిన్యూ అవుతోంది. పరకామణి చోరీ కేసు అయితే బిగ్ టర్న్ తీసుకుంది. పరకామణి చోరీ కేసులో నిందితులను ఎప్పుడో గుర్తించారు. అతడి ఆస్తులపై దర్యాప్తు నడుస్తోంది. కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్ అనే అధికారి అనుమానాస్పద మృతి చెందడంతో పరకామని కేసు క్లైమాక్స్‌లో బిగ్ టర్న్ తీసుకున్నట్లు అయ్యింది. ఇక హుండీ చోరీ కేసులో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరెడ్డి, టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ విచారించింది. ప్రశ్నలు వేసి ఏం జరిగిందనే దానిపై ఆరా తీసింది. పరకామణి చోరీ చేసిన రవికుమార్ ఆస్తుల జప్తులో ఏం జరిగింది.? ఎంత చోరీ జరిగితే..ఎన్ని ఆస్తులు జప్తు చేశారు.? రాజీ కుదర్చిందెవరు.? ఎవరి ఒత్తిడి వల్ల ఇదంతా చేశారని.? ఆరా తీస్తుంది సీఐడీ. నిందితులతో భూమన, ధర్మారెడ్డి, వైవీసుబ్బారెడ్డికి ఉన్న లింకులపై కూపీ లాగుతోంది. ఈ క్రమంలోనే సంచలనం సృష్టించిన టీటీడీ పరకామణి కేసులో దర్యాప్తును స్పీడప్ చేశారు సీఐడీ అధికారులు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ మూడుసార్లు ప్రశ్నించిందిపరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని కాపాడేందుకు గత ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులే దగ్గరుండి వ్యవహారాన్ని నడిపించారని, చివరకు కేసు పెట్టినా కూడా లోక్ అదాలత్‌లో కొట్టేసేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపణలున్నాయి. ఇదంతా జరగడానికి కోట్లు చేతులు మారాయనే అభియోగాలు లేకపోలేదు. ఈ క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు అతిపెద్ద చిక్కుముడిగా మారింది. కీలక సాక్షి లేటెస్ట్‌గా మృతి చెందడంతో కేసు మరింత జఠిలం అవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్. పరకామణి కేసులో కూడా మరోసారి వైవీ సుబ్బారెడ్డికి సీఐడీ నుంచి పిలుపురావడం రకరకాల చర్చకు దారితీస్తోంది. ఇక తిరుమల కల్తీ నెయ్యి కేసు కూడా కొత్త టర్న్ తీసుకుంటోంది. సుప్రీం ఆదేశాలతో ఏర్పాటైన స్పెషల్ సిట్..ఇప్పటికే టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారించింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నను అరెస్ట్



చేసింది. లేటెస్ట్‌గా వైవీ సుబ్బారెడ్డిని కూడా హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో ప్రశ్నించింది స్పెషల్ సిట్ టీమ్. అయితే 2019 నుంచి 2014 వరకు జరిగిన నెయ్యి సరఫరాపై మాత్రమే ఎందుకు విచారణ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు వైవీ సుబ్బారెడ్డిపదేళ్లలో నెయ్యి సప్లైపై విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లడ్డూ ఆరోపణలపై పాలీ గ్రాఫ్ పరీక్షకు సిద్దంగా ఉన్నట్లు ప్రకటించిన సుబ్బారెడ్డి..రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపించారు. స్వామివారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విషప్రచారం చేస్తున్నారని..కల్తీ నెయ్యి వ్యవహారంలో లైడిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమని అంటున్నారు వైవీ సుబ్బారెడ్డి. తనకు కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఉండగా..నెయ్యిలో అవినీతి ఎందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. పరకామణి విషయంలో ఏం జరిగిందో తనకు తెలియదంటున్న వైవీ సుబ్బారెడ్డి..శ్రీవారి సేవలో నీతి నిజాయితీతో పనిచేశానని చెప్తున్నారు. అటు దర్యాప్తు సంస్థల విచారణ కొనసాగుతుండగానే..ఏపీ ప్రభుత్వం మాత్రం నిందితుల పట్ల కఠినంగా ఉంటామని తేల్చి చెబుతోంది. తప్పుచేసిన వారిని శ్రీవారు వదిలిపెట్టరని..శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరిస్తోంది. అయితే కల్తీ నెయ్యి కేసులో సిట్..పరకామణి కేసులో సీఐడీ దర్యాప్తు స్పీడప్ అవడం ఉత్కంఠ రేపుతోంది. ఓవైపు విచారణ కొనసాగుతుండగానే..ఓవైపు కల్తీ నెయ్యి..ఇంకోవైపు పరకామణి వ్యవహారంపై.. కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. సమయం, సందర్భం దొరికినప్పుడల్లా కూటమి లీడర్లు రియాక్ట్ అవడం..తామేం తప్పు చేయలేదని వైసీపీ లీడర్లు వివరణ ఇచ్చుకుంటుండం..హాట్ టాపిక్‌గా నడుస్తోంది. పరకామణి కేసుతో పాటుకల్తీ నెయ్యి ఇష్యూలో కూడా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి ఇద్దరు విచారణను ఫేస్ చేస్తుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి చుట్టూ ఈ రెండు కేసుల విచారణ కొనసాగుతుండటం బర్నింగ్ టాపిక్ అవుతోంది. అయితే ఈ ముగ్గురు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. భూమన వైఎస్సార్ నుంచి జగన్ వరకు వాళ్ల ఫ్యామిలీ వెంట నడిచిన నేత. ఇక ధర్మారెడ్డి వైసీపీ హయాంలో టీటీడీలో అన్నీ తానై వ్యవహరించారు. ఈ ముగ్గురిని కార్నర్ చేసి..జగన్‌ను రాజకీయంగా వీక్ చేయాలని కూటమి కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది వైసీపీ. పరకామణి కేసు..కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో కన్‌క్లూజన్ ఎప్పుడో వేచి చూడాలి మరి

# కూటమి చేతికి మండలి

విజయవాడ,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. వారి రాజీనామాలు విషయంలో కోర్టు నాలుగు వారాల పాటు గడువు విధించింది. జయ మంగళం వెంకట్రమణ కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు తీర్పు వచ్చింది. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం శాసనమండలి చైర్మన్ పై ఏర్పడింది. గత ఏడాది కాలంగా ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం నలుగుతూనే ఉంది. వైసీపీ రాజకీయ అవసరాల కోసం శాసనమండలి అవసరం. చైర్మన్ మోసేన్ రాజు ఆ పార్టీకి చెందిన నేత కావడంతో హై కమాండ్ నుంచి ఇంతవరకు ఎమ్మెల్సీల రాజీనామా పై ఆదేశాలు రాలేదు. దీంతో చైర్మన్ సైతం ఆ రాజీనామాలను ఆమోదించలేదు. అయితే ఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. ఇప్పుడు అదే శాసనమండలి ఆయనకు అక్కరకు వస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కర్రీ పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకీయా ఖానం తదితర ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామా ఆమోదానికి నోచుకోకపోవడంతో వారు తమకు నచ్చిన కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇందులో జనసేనలో చేరిన జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించారు. నాలుగు వారాల్లో ఒక నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. అయితే రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది రాజీనామా చేసే అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గిపోయినట్టేఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 151 సీట్లతో ఘనవిజయం సాధించింది. అయితే అప్పటికే తెలుగుదేశం పార్టీకి శాసనమండలిలో బలం ఉంది. ఆ పార్టీ నేత మండలి చైర్మన్ గా ఉండేవారు. కీలక బిల్లులతో పాటు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలకు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీ అభ్యంతరాలు చెప్పేది. బిల్లులను అడ్డగించేది. దీంతో జగన్మోహన్ రెడ్డి ఏకంగా శాసనమండలిని రద్దు చేయాలని కోరుతూ కేంద్రానికి నివేదిక ఇచ్చారు. అయితే అప్పట్లో కేంద్రం దీనికి సమతం తెలపలేదు. అప్పట్లో కేంద్రం అనుమతి ఇచ్చి ఉంటే ఇప్పటికే రద్దు జాబితాలో శాసనమండలి చేరిపోయేది. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమికి అనుకూలంగా పనిచేసారని రఘురాజు అనే వైసిపి ఎమ్మెల్సీ ఫై వేటు వేశారు చైర్మన్ మోసేన్ రాజు. విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న రఘురాజు పై వేటు పడడంతో ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధపడింది. కానీ కోర్టు స్టే విధించడంతో ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. అయితే స్వయంగా ఎమ్మెల్సీలు రాజీనామా చేస్తే మాత్రం చైర్మన్ ఆమోదం తెలపడం లేదు. అయితే ఇప్పుడు జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి. ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం తెలిపితే మాత్రం శాసనమండలిలో మిగతా ఎమ్మెల్సీలు సైతం రాజీనామా బాటకు అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలి సైతం టిడిపి కూటమికి చిక్కినట్టే.

# 3 లక్షల కోట్లు దాటిన వైజాగ్ డేటా సెంటర్

విశాఖపట్టణం,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్గా రూపుదిద్దుకుంటోంది. టెక్ దిగ్గజాలు, ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ డేటా సెంటర్ల ఏర్పాటుకు క్యూ కట్టడంతో, మొత్తం పెట్టుబడులు ఏకంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ పెట్టుబడుల సునామీకి ఊతం ఇస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో భారీ అడుగు వేసింది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ , డిజిటల్ రియాల్టీ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన 'డిజిటల్ కనెక్షన్' విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం గల అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు కోసం రిలయన్స్ జాయింట్ వెంచర్ సుమారు రూ. 98,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. 2030 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. రిలయన్స్‌తో పాటు ఇప్పటికే ప్రపంచ దిగ్గజ సంస్థలు విశాఖలో భారీ పెట్టుబడులు ప్రకటించాయి. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో 1 ఉచి సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్. రూ. 1.10 లక్షల కోట్లతో డేటా సెంటర్ల నిర్మాణం. రూ. 16,000 కోట్ల పెట్టుబడితో 550 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ల కాంప్లెక్స్. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ఏర్పాటు, సిఫీతో కలిసి 500 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ (రూ. 15,266 కోట్లు)మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి 6,000 మెగావాట్ల డేటా సెంటర్‌ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 3.65 గిగావాట్లకు పైగా ఒప్పందాలు కుదిరాయి.

# మరో 20 వేల ఎకరాలకు భూ సేకరణ

విజయవాడ, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు రెండో దశ భూసేకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ వంటి వాటికి భూములు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రెండో దశ భూసేకరణకు సంబంధించి చర్చించారు. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది రాష్ట్ర మంత్రివర్గం. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలు సేకరించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ చేపట్టే గ్రామాలను మంత్రివర్గం పరిశీలించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి రెండోదశ భూసమీకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం (నవంబర్ 27) అన్నారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న సంస్థలకు భూములు లేవని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ, రైల్వేస్టేషన్ నిర్మించేందుకు కూడా భూములు అవసరమని చెప్పారు. ఇవన్నీ వస్తేనే అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో రెండో దశ భూసేకరణ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు తీసుకుంది. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చే ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ భూమితో కలిపి రెండో దశలో 20 వేల ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో భూసేకరణతో పాటు దాదాపు 25కుపైగా అజెండా అంశాలపై చర్చించారు. ఈ కేబినెట్ సమావేశంలో భూసేకరణ చేయబోయే ప్రాంతాలను పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి వంటి ప్రాంతాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్యం, అభ్యంతరాలు వంటి అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించినట్లు చెబుతున్నారు. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు , వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు సేకరించాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. రైతుల వద్ద నుంచి సేకరించిన భూమితో పాటు ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సమాచారం. త్వరలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే అమరావతి నిర్మాణానికి మొదటి విడతలో రైతుల నుంచి 34,000 ఎకరాలు సమీకరించారు. ఇప్పుడు రెండో విడతకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటికి అదనంగా 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం సీఆర్డీఏకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. అంటే.. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి మొత్తం దాదాపు 70,0 00 ఎకరాల భూమి సిద్ధమవుతోందన్నమాట.

కాగా, రాజధాని రైతులతో గురువారం సచివాలంలో సమావేశమయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రెండున్నర గంటల పాటు సాగిన మీటింగ్‌లో రాజధాని అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. రైతులు సహకరించకపోతే.. అమరావతి ఒక మున్సిపాలిటీగా మిగిలిపోతుందని అన్నారు. ప్రతి చిన్న విషయానికి సోషల్ మీడియాకు ఎక్కి రచ్చ చేయొద్దని, అంతర్గత విభేదాలతో సమస్యను పెద్దది చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. అమరావతి రైతుల్లో జేఏసీలు ఎక్కువగా ఉన్నాయని.. అందులో ఐకమత్యం లేదన్నారు. అందరూ ఒకేతాటిపై నిలబడి అమరావతి అభివృద్ధి కమిటీగా ఏర్పడాలని చంద్రబాబు సూచించారు.

# పురుగుల మందులతో రైతులు ధర్నా అబ్బాయిగూడెం లో ఉద్రిక్తత

ములుగు నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ములుగు జిల్లా వెంకటాపురం మండలం భద్రాచలం వెంకటాపురం ప్రధాన రహదారిపై అబ్బాయి గూడెం గ్రామస్తులు పురుగుమందు డబ్బాలతో ధర్నా చేపట్టారు. మిర్చి పంట పొలాల చుట్టూ ఉన్న ఫెన్సింగ్ పోళ్లను ఇసుక లారీలు తొక్కడంతో ఎందుకు ఇలా తొక్కించారని ప్రశ్నించడంతో మహిళతోపాటు మరికొంతపై సొసైటీ సభ్యులు దాడి చేశారు. అస్వస్థతకు గురైన మహిళను వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు .మహిళపై దాడిని నిరసిస్తూ అబ్బాయి గూడెం గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు నాలుగు గంటలుగా రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది అక్కడ చేరుకున్న పోలీసులు సైతం సముదాయించలేకపోవడంతో సమంత పిఓ వచ్చేంతవరకు రోడ్డుపై బైఠాయించారు. పిఓ నామమాత్రంగా వచ్చి వెళ్లిపోవడంతో మరింత వివాదానికి దారి తీసింది

ఇసుక లారీల కారణంగాపంటలు పాడవుతున్నాయని, రోడ్లు ధ్వంసమవుతున్నా యంటూ మొర్ర వానిగూడెంలో రైతులు, గ్రామ స్థులు రోడ్డెక్కారు. తమ బతు కులపై మట్టి కొట్టొద్దంటూ గ్రామంలో రిలేదీక్ష చేపట్టి ఆందోళనకు దిగారు. మొర్రవానిగూడెం, ఆ పంచాయతీ పరిధి లోని అబ్బాయిగూడెం రైతులు పంట పొలాలకు వేసుకున్న రహదారిని ఇసుక రవాణాకు ఉపయోగి స్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రూ.వేలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన మిరప పంటలు లారీల రాకపోకలతో వచ్చే దుమ్ముతో పాడవుతున్నాయని, దిగుబడిపై ప్రభావం పడుతోందని ఆందో ళన వ్యక్తం చేశారు. పంట పొలాల దారి నుంచి కాకుండా మరో మార్గంలో లారీలు తిప్పాలన్నారు.

## ఇనుపాముల గ్రామంలో చైన్ స్నాచింగ్

నల్గోండ నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామ శివారులో శుక్రవారం రాత్రి సమయంలో ఎస్.ఎస్.రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద చైన్స్ స్నాచర్ హాల్ చల్ చేశాడు. ఉప్పుల వెంకటరమణ అనే మహిళ ను అడ్డగించి, బెదిరించి, చెవి దిద్దులు, పుస్తెలతాడు సహా మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. బాధిత మహిళ కేకలు వేయడంతో, స్థానికులు దొంగను పట్టుకోవడానికి ప్రయత్నించారు. చీకట్లోకి తప్పించుకొని పారిపోయిన దొంగ కోసం పోలీసులు గాలించారు.

## మహారాష్ట్ర పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అనంత్

భద్రాచలం నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

మావోయిస్టు పార్టీ ఎంఎంసి స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికాస్ నాగపురే అలియాస్ అనంత్, మహారాష్ట్ర గొండియా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పదిహేను మంది సహచరులతో కలిసిఅయుధాలతో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. జనవరి ఒకటవ తేదీ వరకు అందరం కలిసి లొంగిపోతామని ఈరోజు లేఖనుఅనంత్ విడుదల చేసాడు. లేఖ వదిలిన 24 గంటలలోపే పోలీసుల ఎదుట లొంపోయాడు.

# ఆ మూడు ఆస్పత్రులకు మంచి రోజులు

గుంటూరు, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ప్రజారోగ్యం, ఆసుపత్రుల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా మూడు ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. పిఠాపురం, మంగళగిరి, చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఏపీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి 22 కోట్ల 74 లక్షల రూపాయలు అదనపు నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల అయ్యాయి.ప్రజారోగ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కీలక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పన, అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మూడు నియోజకవర్గాలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రాష్ట్రంలోని మూడు ఏరియా ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి ఏపీ ప్రభుత్వం ఈ మేరకు రూ.22.74 కోట్లు అదనపు నిధులు కేటాయించింది. మంగళగిరి. పిఠాపురం ఏరియా ఆస్పత్రి , చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు ఏపీ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు మంగళగరి ఏరియా ఆస్పత్రి సామర్థ్యం ప్రస్తుతం 30 పడకలు మాత్రమే. ప్రజా అవసరాల నేపథ్యంలో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని.. ఈ ఆస్పత్రికి అదనంగా 73 పోస్టులు కేటాయించాలని నిర్ణయించారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా అదనపు పడకలు, అదనపు పోస్టుల కోసం రూ.52.20 కోట్లు కూడా కేటాయించారు. అలాగే మంగళగిరి ఏరియా ఆస్పత్రిని చినకాకాని వద్ద ఉన్న వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో నిర్మించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం పాడవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు మంత్రి నారా లోకేష్ మంగళగిరి ఏరియా ఆస్పత్రి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఆస్పత్రిని కార్పొరేట్ వసతులతో నిర్మించాలని.. అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఇప్పటికే సూచనలు చేశారు. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్.. రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు.రోగులకు ఉపయోగపడేలా ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. విశాలమైన పార్కింగ్ స్థలం కేటాయించనున్నారు. ఈ ఏరియా ఆస్పత్రికి మంగళగిరి నియోజకవర్గం నలుమూలల నుంచి చికిత్స కోసం ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రోగులతో పాటుగా వారి బంధువుల కూడా అసౌకర్యం కలగకుండా వసతి ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనితో పాటుగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం ఏరియా ఆస్పత్రికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

# మారనున్న సింహాచలం రూపురేఖలు

విశాఖపట్టణం,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన జరిగింది. నాల్కో సంస్థ సీఎస్ఆర్ కింద్ ఇచ్చిన రూ. 1.58 కోట్ల నిధులతో చేపట్టిన షెడ్లకు శంఖుస్థాపన చేశారు. ఇక కోల్‌కతాకు చెందిన ఓ భక్తుడు ఇచ్చిన రూ. 45 లక్షల విరాళంతో తొలిపావంచా వద్ద నిర్మించనున్న షెడ్డుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



శంఖుస్థాపన చేశారు. అంతేకాకుండా రూ. 3 కోట్లతో నిర్మించిన టీఎంఎస్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచల ఆలయ ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు.రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం వెలుగొందుతోంది. విశాఖపట్నం జిల్లాలో కొలువై ఉన్న సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ ప్రసిద్ధ ఆలయం రూపురేఖలు మారుతున్నాయి. భక్తులు ఇచ్చిన విరాళాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి.. రూ.3 కోట్లు వెచ్చించి సింహగిరిపై టీఎంఎస్ (టెన్సిల్ మెంబ్రేన్ షెల్టర్) షెడ్డు నిర్మించారు.కాగా, ఈ టీఎంఎస్ షెడ్డు ప్రారంభోత్సవం సింహగిరిపై జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి గణబాబు పాల్గొన్నారు. టీఎంఎస్ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. కేవలం వంద రోజుల వ్యవధిలో.. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేశారని చెప్పారు. దాతలకు, గుత్తేదారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.ఈ షెడ్డు ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపన కార్యక్రమాల్లో గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచలం దేవస్థానంలో వైసీపీ పాలనలోని అవశేషాలను తొలగిస్తామన్నారు. గత ప్రభుత్వంలోని కొందరు సింహాచల క్షేత్రాన్ని వివాదాలకు చిరునామాగా మార్చారని.. తాము ఈ దేవస్థానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. అంతేకాకుండా గత కొన్నాళ్లుగా స్వామివారి ఆభరణాల లెక్కల్లో తేడాలు వస్తున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఉద్యోగుల వ్యవహారాలు, తదితర ఆరోపణలు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ప్రసాద్ పథకం పనులు త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు.సింహాచల కొండపై విరాళాలతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. అందులో లోవతోటలో రూ. 98 లక్షలతో, ఆలయ ప్రాకారం చుట్టూ రూ. 60 లక్షలతో.. నాల్కో సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన షెడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. దాంతో పాటు కోల్‌కతాకు చెందిన దాత ఇచ్చిన విరాళంతో కొండ దిగువన తొలిపావంచా దగ్గర రూ. 45 లక్షలతో నిర్మించనున్నారు

# మజీద్ పూర్ బావర్చి రెస్టారెంట్లో యువకుడు అనుమానాస్పద మృతి

శామీర్ పేట నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

బ్రతుకుదెరువు కోసం వచ్చి ఓ యువకుడు అనుమానస్పదంగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు స్థానికుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన షేక్ అంజూమ్ (23) బ్రతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి మేడ్చల్ జిల్లా మజీద్ పూర్ పరిధిలోని డైమండ్ బావార్చి రెస్టారెంట్ లో గత నాలుగు నుంచి వెయిటర్ గా పని జీవిస్తున్నాడు. సాయంత్రం విధులు ముగించుకొని రెస్టారెంట్ రూమ్ లోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి . విషయాన్ని గమనించిన మిగతా వెయిటర్స్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.యువకుని మృతికి గల కారణాలు తెలియరాలేదు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎర్రమల లో ఛత్తీస్ ఘడ్ పోలీసుల గాలింపులు

నంద్యాల నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

కొలిమిగుండ్ల (మం) ఎర్రమల కొండ ప్రాంతం లో మావోయిస్టులు సంచరిస్తూన్నరని వార్తలు కలకలం రేపాయి. నేల బిళనీ, ఓబులేసు కోన, ఎర్రకోన ప్రాంతాల్లో చత్తీస్ ఘడ్ ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపులు చేపట్టాయి. ఇక్కడి పలు సిమెంట్ పరిశ్రమల్లో ఒరిస్సా ఛత్తీస్గడ్, జార్ఖండ్, బీహార్ కార్మికులు పని చేస్తున్నారు. కొలిమిగుండ్ల ప్రాంతాన్ని మావోయిస్టులు షెల్టర్ జోన్ గా భావించి ఉండ వచ్చుననే అనుమానం తో పోలీసులు గాలిస్తున్నారు. సుమారు 20 మందికి పైగా రెండు ప్రతేక వాహనాల్లో ఛత్తీస్గఢ్ పోలీసులు బృందాలు వచ్చాయి.

గతంలో బెలుం పరిసర ప్రాంతాల్లో జనశక్తి నక్సల్స్ , పోలీసుల మధ్య జరిగిన కాల్పులు సంచలం రేకెత్తించాయి. తాజాగా చత్తీస్ ఘడ్ పోలీసులు గాలింపులు స్థానికం గా చర్చనీయాంశం అయ్యాయి.

## పోలీసులపై కత్తితో దాడి పోలీసుల కాల్పులు ఇద్దరికి గాయాలు

నెల్లూరు నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

జిల్లాలో నిందితులను అదుపులోకి తీసుకునే క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. కోవూరు పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు కాల్పులు జరిపిన ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది.


కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో పెంచలయ్య అనే వ్యక్తిని శుక్రవారం రాత్రి దుండగులు హత్య చేశారు. ఈ కేసులో పాల్గొన్న నిందితులు షుగర్ ఫ్యాక్టరీ పరిసరాల్లో దాక్కున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిందితులను పట్టుకునే ప్రయత్నంలో వారు కత్తులతో పోలీసులు మీద దాడి చేయడంతో, ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో జేమ్స్ అనే నిందితుడికి మోకాలికి గాయం కాగా, ఒక పోలీస్ కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడ్డారు.

ఇద్దరినీ నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి, మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# అమరావతిలో కృష్ణమ్మకు నిత్య హారతి

విజయవాడ, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణ



పనుల మాస్టర్ ప్లాన్ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఆలయం క్లీన్, గ్రీన్, హైజినిక్‌గా ఉండటంతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అన్నప్రసాదం భవనాన్ని విస్తరించాలని చెప్పారు. ఇక కృష్ణమ్మకు నిత్యహారతి ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కాగా, విస్తరణలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 7 అంతస్తుల్లో మహా రాజగోపురంతో పాటు మూడు రాజగోపురాలు నిర్మించనున్నారు. భక్తులు, వీఐపీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.దేవతల రాజధానిగా సీఎం చంద్రబాబు అభివర్ణించిన అమరావతిలో దేవదేవుడి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబువుతోంది. అమరావతిలోని వెంకటపాలెం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్ను చంద్రబాబు పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం క్లీన్, గ్రీన్, హైజినిక్ మోడల్ ఉండాలని చెప్పారు. ఆలయ నిర్మాణాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడాలని.. అమరావతికి వేంకటేశ్వర ఆలయం అదనపు ఆకర్షణ కావాలన్నారు. ప్రస్తుతం వెయ్యి మందికి సరిపోయేలా నిర్మిస్తున్న అన్నప్రసాదం అందించే భవనం.. భవిష్యత్తులో 20 వేల మందికి సరిపోయేలా విస్తరించేలా ప్లాన్ ఉండాలని తెలిపారు. అందుకు అనుగుణంగా పునాది పనులు చేపట్టాలని సూచించారు. ఆలయ చేపట్టిన అన్ని నిర్మాణాల్లోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.ఆలయ నిర్మాణ పనులు రెండు దశల్లో చేపట్టే ప్రతిపాదనలు ఏం వద్దని.. ఒకే దశలో అన్ని చేపట్టాలని చంద్రబాబు సూచించారు. తిరుమల శ్రీవారి ఆలయ తరహాలోనే.. వాస్తు పరిమితికి లోబడి నిర్మాణాలు ఉండాలని చెప్పారు. కృష్ణా నదికి అభిముఖంగా రెండెకరాల్లో 50 కాటేజీలు నిర్మించాలని.. నిత్య పూజలు, భజనలు ఉండాలన్నారు. అంతేకాకుండా ఆలయం పక్కనున్న కృష్ణా నదిలో.. గంగా హారతి మాదిరిగా.. సాయంత్రం కృష్ణమ్మ నిత్యం హారతి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు.ఆలయ ప్రాంగణంలో ధ్యాన మందిరాన్ని నిర్మిస్తారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో కలిపి దీన్ని నిర్మిస్తారు. ఇందులో ఎగ్జిబిషన్ హాళ్లు ఉండనున్నాయి. ఇక భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు వీలుగా డైనింగ్ హాల్, కిచెన్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం.. హెల్ప్ డెస్క్‌లు, కల్యాణ కట్ట, డార్మెటరీలు, లాక్ రూమ్, 3 వెయిటింగ్ హాల్స్ నిర్మిస్తున్నారు.

ఇక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో వివిధ సేవలకు టికెట్లు అందించేందుకు రిజిస్ట్రేషన్ కౌంటర్లు, సిబ్బందికి గదులు, ప్రథమ చికిత్స గది ఏర్పాటు చేస్తారు. 12 మంది ప్రధాన అర్చకులకు, 12 మంది సిబ్బందికి క్వార్టర్లు నిర్మిస్తారు. అలాగే ఎవరైనా విశిష్ట అతిథులు వస్తే బస, విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా.. ఓ విశ్రాంతి భవనాన్ని నిర్మించనున్నారు. అందులో రెండు వీవీఐపీల సూట్స్, 3 వీఐపీ సూట్స్, డైనింగ్ హాల్, సమావేశ గది, ఏసీ సదుపాయంతో 20 గదులు, వీఐపీ లాబీ, కిచెన్, ప్యాంట్రీ, రిసెప్షన్ వంటి అన్ని సౌకర్యాలు ఉండనున్నాయి.భక్తులకు ప్రసాదాలు అందించడానికి 8 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా 3 ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రకాశ్ ఉద్యానంలో లేజర్ షో ఏర్పాటు చేయనున్నారు. ఆలయ గోడలు, అంతర్గత రహదారులు, ప్రధాన ముఖద్వారం నిర్మించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు.ఆలయం తూర్పు వైపు 110 అడుగుల ఎత్తున, 7 అంతస్తుల్లో మహా రాజగోపురం నిర్మిస్తారు. మిగతా 3 వైపులా 60 అడుగుల ఎత్తుతో ఐదు అంతస్తుల్లో రాజగోపురాలు నిర్మించనున్నారు. కల్యాణ మండపం, అద్దాల మండపం, రథ, ఆర్జి, వాహన వంటి సేలవకు ప్రత్యేక మండపాలు, పుష్కరిణి కూడా నిర్మించడానికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అయితే ఈ పనులు ఇప్పటి టెండర్లు ఆహ్వానించి గుత్తేదార్లను ఎంపిచ చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

# సజ్జలకు రక్షణ కవచం

విజయవాడ,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):



వైసీపీ అధినేత వైఎస్ జగన్ పక్కన సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే ఇప్పుడున్నారు. అధికారంలో ఉన్న సమయంలో ఆయన పక్కన ఉన్నవారంతా ఒక్కొక్కరూ విడిచిపెట్టి వెళ్లిపోయారు. గతంలో వైఎస్ జగన్ తో పాటు సజ్జల రామకృష్ణారెడ్డి, మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయన వెంట ఉండేవారు. అయితే అధికారులు అక్రమ మద్యం కేసులో అరెస్టయ్యారు. ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే మిగిలారు. సజ్జల రామకృష్ణారెడ్డి కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంత మౌనంగానే ఉంటూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని శాఖలపై పెత్తనం చేసినట్లు నాడు ప్రతిపక్ష టీడీపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సజ్జలపై కేసులు నమోదవుతాయని భావించింది.అయితే కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదు కాకపోవడంతో టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కానీ సజ్జల పై నమోదు చేయడానికి సరైన ఆధారాలు దొరకడం లేదని, అందుకే కేసులు నమోదు కావడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ పార్టీలో కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి చంద్రబాబుపై కేసులు తిరగదోడతామని సజ్జల ప్రకటించడం చూస్తుంటే ఆయనకు ధైర్యం వచ్చినట్లే కనిపిస్తుంది. సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ చెప్పే ఆదేశాలను అమలుపర్చి నాడు టీడీపీ, జనసేనలకు టార్గెట్ అయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డిపైన కూడా అనేక కేసులు నమోదయ్యాయి. అయితే వాటిలో ముందస్తుబెయిల్ తెచ్చుకున్న సజ్జల ప్రస్తుతం బిందాస్ గా ఉన్నారు.సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలోనూ ఆయన అటవీ భూములను ఆక్రమించారన్న ఆరోపణలపై కేసు నమోదుతో పాటు భూమిని కూడా స్వాధీనం చేసుకుంది. అయినా సరే అందులోనూ ఆధారాలు లభించలేదు. పది నెలల నుంచి మౌనంగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి తాజాగా ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. సజ్జల యాక్టివ్ అవ్వడంతో ఇక నేతలు కూడా రోడ్డు మీదకు వస్తారని చెబుతున్నారు. జగన్ కూడా బెంగళూరు నుంచి విజయవాడకు టూర్ వేస్తుండటంతో రాష్ట్రంలో పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి చూసుకునేందుకు ఉపయోగపడుతున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి వైసీపీలో కీలకంగా మారుతున్నారు. జగన్ కూడా రాజీనామాలు చేసిన మాట విని ఆయనను పక్కన పెట్టే ప్రయత్నం చేయడం లేదు. రానున్న రోజుల్లో సజ్జల రామకృష్ణారెడ్డి మరింత కీలకంగా పార్టీలో మారనున్నారన్నది వాస్తవం.

# అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలు

విజయవాడ, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం ఆయనకు అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలుగా మారే అవకాశాలున్నాయి. నిధుల కొరతతో పాటు సంక్షేమాన్ని అమలు చేయడం కత్తిమీద సాముగా మారింది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్న ప్రయత్నంలో ఆయన ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పేశారు. మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు ఆడబిడ్డ పథకం కింద.. నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రతిపక్ష వైసీపీ పదే పదే గుర్తు చేస్తుంది.రెండు పథకాలు అమలు చేయాలంటే అంత సులువు కాదు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చెందిన ఆస్తులు అమ్మాల్సిందేనని అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అర్హులు ఎందరు? ఎవరికి ఇస్తారన్న దానిపై పథకం క్లిక్ అయ్యేది ఆధారపడి ఉంటుంది. ఏదో కొందరికి ఇచ్చామని మమ అనిపించడానికి వీలులేదు. మహిళల్లో ఒకరికి వచ్చి పది మందికి పథకం రాకపోతే ఇరవై మంది వ్యతిరేకమవుతారు. నిరుద్యోగ భృతి కూడా అంతే. అది అమలుకు సాధ్యమయ్యే హామీ కాదు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వాలంటే ఖజానా సరిపోదు. అందుకే చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.గతంలో సంక్షేమంపై చంద్రబాబు ఎన్నడూ ఇలా టెన్షన్ పడలేదు. ఆయన దృష్టంతా అభివృద్ధిపైనే ఉంది.



గత ప్రభుత్వం అప్పులు చేసిందని, విధ్వంసం నుంచి బయటపడేస్తున్నామని చెప్పాలనుకున్నా కుదిరే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే రెండేళ్ల సమయం పూర్తయింది. ప్రస్తుతం గ్రౌండ్ చేసిన హామీలను అమలు చేయడానికే అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రతి నెల అప్పుల కోసం ఢిల్లీ వైపు చూడాల్సి వస్తుంది. మరొకవైపు రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం వంటివి కూడా సవాలుగా మారుతున్న సమయంలో చంద్రబాబు నాయుడు ఈ రెండు పథకాలను అమలు చేయడానికి అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి తలకిందులు తపస్సు చేసినా సాధ్యం కాదన్నది ప్రతిపక్షం ఆలోచన. అందుకే ఆరెండింటిపైనే ఎక్కువగా విమర్శలు చేస్తున్నారు. మరి చంద్రబాబు ఈ రెండు పథకాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి

# చివరి దశకు నక్సల్స్ ఉద్యమం

హైదరాబాద్,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

: అన్నలు.. అలియాస్.. నక్సలైట్లు.. అలియాస్ మావోయిస్టులు.. పేరు ఏదైనా.. పిలిచేది ఎలా అయినా.. వారి పంథా మాత్రం ఒక్కటే. పాలకుల వ్యతిరేక ఉద్యమం.. రాజ్యాంగ వ్యతిరేక ఉద్యమం. దళిత, బహుజన, పీడిత వర్గాల కోసమే పోరాడుతాన్నామంటున్న మావోయిస్టులు.. దళితుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నారు. దాదాపు ఐదు దశాబ్దాలు దేశంలో అజ్ఞాతంలో ఉంటూ ప్రభుత్వాలకు సమాంతర పాలన సాగించే ప్రయత్నం చేశారు. అడ్డు చెప్పిన వారిని అంతం చేశారు. పేదల పక్షాన నిలిచినా.. ఇన్‌ఫార్మర్ల పేరుతో పేద గిరిజనులను చంపేశారు. పోలీసులను పొట్టన పెట్టుకున్నారు. మన శత్రు దేశాలతో చేతులు కలిపి ఆయుధాలు పొందుతున్నారు. అయితే ఇప్పుడు పెరిగిన సాంకేతికత మావోయిస్టుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. రాజ్యాంగేతర శక్తుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత దేశంగా ఈ ఆపరేషన్ కొనసాగిస్తోంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా వందల మంది మావోయిస్టులు హతమయ్యారు. వందల మంది భయంతో లొంగుబాట పడుతున్నారు.ఇన్నాళ్లూ ఎర్రజెండాయే మా ఊపిరి అని ఉద్యమం సాగించిన మావోయిస్టులు ఆపరేషన్ కగార్ దెబ్బకు తెల్ల జెండా పట్టుకుని శాంతి మంత్రం జపిస్తున్నారు. తాజాగా మావోయిస్టు కీలక నేత అనంతర్ పేరుతో ఒక ప్రకటన వచ్చింది. 2026 జనవరి 1 నుంచి ఆయుధాలను వదిలించి సాయుధ పోరాటాన్ని పూర్తిగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ప్రతీ మావోయిస్టు ఒకేసారి లొంగిపోయే ఈ నిర్ణయం, గతంలో మల్లోజుల, ఆశన్న వంటి అగ్రనేతల లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్లతో పార్టీ బలహీనమయ్యింది అనే వాస్తవాలను ప్రతిబింబిస్తోంది.ఒకప్పుడు మావోయిస్టులకు ప్రజలు అండగా నిలిచేవారు. కానీ ఇప్పుడు మద్దతు దాదాపుగా లేదు. ఇక వరుస ఎన్‌కౌంటర్లతో పార్టీ బలహీనపడింది. సిద్ధాంతాలు కనుమరుగయ్యాయి. కేంద్రం కూడా లొంగిపోవాలని పదే పదే పిలుపునిస్తోంది. మావోయిస్టు ఉద్యమ నాయకుల అనుమతితో పునరావాసం, సమాజంలోతో



కలసే దిశలోకి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ నిర్ణయం భారతీయ దేశంలో దీర్ఘకాలంగా కొనసాగిన మావోయిస్టు యుద్ధానికి ఒక మలుపుగా భావించవచ్చు. ప్రాంతీయ రాజకీయాలు, సైనిక చర్యల మధ్య పాదదండనలు, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్ల కారణంగా ఈ ఉద్యమం స్వచ్ఛందంగా తేలికపడి ఉండవచ్చు. జనజీవనంలో మిళితమవుతూ సామాజిక సహకారంతో మావోయిస్టుల అంతరిక్షంలో సమాధి వస్తుందని దీన్ని విశ్లేషకులు భావిస్తున్నారు.మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం లొంగిపోయేవారి పునరాలోచనలు, పునరావాసంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని మావోయిస్టులు సూచించారు. ఇది సుస్థిర శాంతి ఏర్పడటానికి ప్రాధాన్యత కలిగిన అంశం. మొత్తంగా చాలా ఆపరేషన్లు, అగ్రనేతుల వదిలిపోవడం మావోయిస్టు ఉద్యమ నిర్ధారణలో సమాధి మార్గం మొదలవుతున్నట్లు తెలుస్తోంది.

# కీలక ఆపరేషనల్ సామర్థ్యాలు

న్యూఢిల్లీ, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసింది. మన బ్రహ్మోస్, రఫేల్ యుద్ధ విమానాల పనితీరు చూసి అంతా షాక్ అయ్యారు. ఇక మన సుదర్శన చక్రం ఎస్ 400 పనితీరు అయితే అద్భుతం. ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో ఆయుధాలు తయారు చేస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ కంపెనీ, భారత సరిహద్దు భద్రతకు బలం చేకూర్చేందుకు ఇంద్రజాల్ రేంజర్ అనే పూర్తిగా కదిలే యాంటీ?డ్రోన్ ప్యాట్రోల్ వాహనాన్ని తయారు చేసింది. ఇది స్థిరంగా ఉన్నప్పుడు మాత్రమే పనిచేసే సంప్రదాయ వ్యవస్థలకు భిన్నంగా, కదలుతూ డ్రోన్‌లను గుర్తించి, ట్రాక్ చేసి, ధ్వంసం చేస్తుంది.అల్?టెరైన్ 4చీ4 టోయోటా హైలక్స్ ప్లాట్‌ఫాం మీద నిర్మించబడిన ఈ వాహనం, 10 కి.మీ. వరకు డ్రోన్‌లను గుర్తించగలదు. 2 కి.మీ. హార్డ్ కిల్ రేంజ్, 3 కి.మీ. సాఫ్ట్ కిల్ రేంజ్ కలిగి ఉంది. స్కైఓఎస్ ఏఐ కమాండ్ సెంటర్ ద్వారా జీఎన్‌ఎస్‌ఎస్ స్పూఫింగ్, ఆర్‌ఎఫ్ జామింగ్, సైబర్ టేకోవర్, స్ప్రింగ్?లోడెడ్ కిల్ స్విచ్‌లతో కూడా సమతుల్యం చేస్తుంది. దీని స్వయంచాలక అంచనా వ్యవస్థ బెడెన్ దాడులను కూడా సమర్థవంతంగా ఎదుర్కొంటుంది.ఇటీవల పాకిస్తాన్ నుంచి డ్రోన్‌ల ద్వారా ఆయుధాలు, మాదక ద్రవ్యాలు అంతర్గతంగా చేర్చిన సంఘటనలు ఈ వాహన అవసరాన్ని స్పష్టం చేశాయి. సంస్థ సీఈవో కిరణ్ రాజు ప్రకారం, ప్రతి డ్రోన్ ధ్వంసం దేశ రక్షణకు బలాన్ని పెంచుతుంది. ఇది ఆధారాలు, కాన్వాయ్‌లు, నగరాల్లో కూడా ప్రవేశపొంది జాతీయ భద్రతను మెరుగుపరుస్తుంది.మొత్తంగా మన సైనికుల అమ్ముల పొదిలోకి మరో కొత్త ఆయుధం, రక్షణ వ్యస్థ చేరబోతోంది. దీంతో సరిహద్దు దాటి వచ్చే డ్రోన్లు గాల్లోనే పేలిపోతాయని సంస్థ వెల్లడించింది.

# విజయ్ గూటికి ఎఐడీంకే నేతలు..

చెన్నై, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

మిళనాడు రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. ఏఐఏడీఎంకే సీనియర్ నేత, తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కేఏ సెంగోట్టయ్యన్ గురువారం నాడు ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజకం(టీవీకే) పార్టీలో చేరారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు సీనియర్ లీడర్ పార్టీలో చేరడం టీవీకేకు పెద్ద బలంగా మారింది. రాజకీయ భీష్ముడికి విజయ్ స్వాగతం సెంగోట్టయ్యన్‌ను టీవీకే ప్రధాన కార్యాలయంలో పార్టీ కండువా కప్పి విజయ్ సాదరంగా ఆహ్వానించారు. 50 ఏళ్ల అనుభవం ఉన్న రాజకీయ దురందురుడు పార్టీలోకి వచ్చినందుకు విజయ్ హర్షం వ్యక్తం చేసారు. ఎంజీఆర్(ఎంజీ రామచంద్రన్)ను నమ్ముకుని 20 ఏళ్ల చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చిన సెంగోట్టయ్యన్.. ఎంజీఆర్, జయలలిత వంటి ఇద్దరు గొప్ప నాయకులకు నమ్మకంగా పనిచేశారని విజయ్ కొనియాడారు. సెంగోట్టయ్యన్ రాజకీయ పరిపక్వత, క్షేత్రస్థాయి అనుభవం టీవీకేకు ఎంతగానో దోహదపడుతుందని విజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు. మరిన్ని కనుగొనండి అంతర్జాతీయ వార్తల సేవలు వార్తా విశ్లేషణ సినిమా వార్తల సేవలు తెలుగు వార్తా సేవలు గిజ్‌బాట్ వార్తల సేవలు పశ్చిమ తమిళనాడులో పట్టు: సెంగోట్టయ్యన్ ఏఐఏడీఎంకే కంచుకోటగా ఉన్న పశ్చిమ తమిళనాడులోని గౌండర్ కమ్యూనిటీకి చెందిన ప్రభావవంతమైన నాయకుడు. ఆయన ఒక అద్భుతమైన ఎన్నికల వ్యూహకర్తగా పేరు పొందారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. 2026 ఎన్నికలకు ముందు టీవీకే తమ క్షేత్రస్థాయి నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నందున, సెంగోట్టయ్యన్‌కు కీలకమైన సంస్థాగత బాధ్యత అప్పగించే అవకాశం ఉంది. అంతేకాకుండా టీవీకే అధికారంలోకి వస్తే, పాలనలో కూడా ఆయనకు భాగస్వామ్యం లభిస్తుందని హామీ ఇవ్వబడింది. ఏఐఏడీఎంకే నుంచి బహిష్కరణకు కారణం జయలలిత మరణం తర్వాత వరుసగా మూడు ఎన్నికల ఓటముల నుంచి పార్టీ కోలుకోవాలంటే అన్ని వర్గాలను ఏకం చేయాలని సెంగోట్టయ్యన్ గట్టిగా వాదించారు. ఏఐఏడీఎంకే నుంచి బహిష్కరించబడిన నాయకులు శశికళ, ఓ.పన్నీర్‌సెల్వం (ూఖూ), టి.టి.వి. దినకరన్‌లను తిరిగి పార్టీలోకి తీసుకోవాలని ఆయన పదేపదే ఎడప్పాడి పళనిస్వామి (ఇఖూ)ని కోరారు. ఓ.పన్నీర్‌సెల్వం, శశికళలను కలిసిన తర్వాత పళనిస్వామి మొదట సెంగోట్టయ్యన్‌ను పార్టీ పదవుల నుంచి తొలగించి, ఆ తర్వాత బహిష్కరించారు. తన బహిష్కరణను వ్యతిరేకిస్తూ ఈపీఎస్ పార్టీలో నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారని సెంగోట్టయ్యన్ విమర్శించారు.

# మేడారం లో మంత్రుల పర్యటన

**అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ బాలరామ్ నాయక్**

ములుగు నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

తాడ్వాయి మండలం మేడారం లో ముగ్గురు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,కొండ సురేఖ, సీతక్క పర్యటించారు. అనంతరం మంత్రులు సమ్మక్క సారాలమ్మ గోవిందరాజు, పగిడిద్ద రాజులను లను దర్శించుకున్నారు.అనంతరం మేడారం లో జరిగే అభివృద్ధి పనులను పరిశీలించారు. గుడి ప్రాంగనం లో రాతితో కట్టే కట్టడా లను వారు పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతి గా పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ మేడారం సమ్మక్క సారాలమ్మ జాతరను ప్రతిష్టత్మాకంగా తీసుకొని అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారని మంత్రి అన్నారు.జాతర పనులను అధికారులు రాత్రానక పగలనక కస్టపడి పనిచేస్తున్నారని, ప్రభుత్వా ఆలోచనలకూనుగుణంగా, భక్తుల సౌకర్యర్థం పనులు జరుగుతున్నాయని, పవిత్రతకు ఇక్కడ భంగం కలగా కుండా, పూజారులకు అనుగుణగా, వారి సూచనల మేరకు పనులు వడివడిగా కొనసాగుతున్నాయని మంత్రి అన్నారు. సకాలంలో పనులు పూర్తి చేస్తామని, పనులు అద్భుతం గా జరుగుతున్నాయని పనులు పరిశీలించమనీ మళ్ళీ వారం రోజుల్లో వచ్చి పనులు పరిశీలిస్తా మని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డీ అన్నారు.

# భవానీ దీక్ష విరమణ ఈవో వి.కె. శీనా నాయక్ సమీక్ష

విజయవాడ నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణ మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి (ఇ.ూ) శ్రీ వి.కె. శీనా నాయక్ గారు ఆలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కార్యనిర్వాహక ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్-1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు, గుమస్తాలు మరియు ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది హాజరయ్యారు.

భవానీ దీక్ష విరమణ కార్యక్రమాలు డిసెంబర్ 11, 2025 న ఉదయం 8 గంగలకు ప్రారంభమై, డిసెంబర్ 15, 2025 న ఉదయం 10-30 గంటలకు మహా పూర్ణాహుతితో ముగుస్తాయి. ఈ ఐదు రోజుల వ్యవధిలో దాదాపు 7 లక్షల మందికి పైగా భవానీ భక్తులు దీక్ష విరమణకు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్టాపన, శత చండీయాగం, గిరి ప్రదక్షిణలు వంటి ప్రధాన క్రతువులు జరుగుతాయి.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, వేచి ఉండే హాళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదం, అన్నదానం పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని అయన ఆదేశించారు.: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు మరియు బందోబస్తు ప్రణాళికలు రూపొందించాలి. భవానీ దీక్షల విరమణ కారణంగా డిసెంబర్ 11 నుండి 16 వరకు అన్ని ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేసి, ఏకాంతంగా నిర్వహిస్తారు.

భవానీ మండల దీక్షలు నవంబర్ 1 నుండి 5 వరకు, అర్ధ మండల దీక్షలు నవంబర్ 21 నుండి 25 వరకు జరిగాయి. డిసెంబర్ 4వ తేదీన కలశజ్యోతి మహోత్సవం నిర్వహించబడుతుంది.

భవానీ దీక్ష విరమణలో భాగంగా మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తారని అయన వెల్లడించారు.

# మానవ జీవితాన్ని ప్రకృతితో అనుసంధానించడమే సైన్స్: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు ప్రకృతితో మమేకమవుతూ సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు, ప్రాజెక్టులు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో 2025-26 సంవత్సర జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శిన, ఇన్స్పైర్ అవార్డ్స్ మనాక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా క్రమం తప్పకుండా మన జిల్లా నుండి సైన్స్ ఎగ్జిబిట్ లు రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం, జాతీయస్థాయికి ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా కరీంనగర్ లో సైన్స్ మ్యూజియం ఉందని, ప్రభుత్వ, ప్రైవేట్ పిల్లలు ఎవరైనా మ్యూజియం సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా విద్యార్థులు బాలశాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని కాబట్టి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలియజేశారు. మన దేశం కోసం, మన ప్రజల కోసం ఏం మంచి చేయగలుగుతామో ఆ దిశగా ఆలోచించడమే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ లక్ష్యమన్నారు.

విద్యార్థులే దేశ భవిష్యత్తు కావున ఇప్పటి విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు, విలువలే భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. వ్యవసాయాభివృద్ధి, ప్లాస్టిక్ నివారణ, పునరుత్పాదక శక్తి, శాస్త్ర సాంకేతికత, నీటి సంరక్షణ, ఆరోగ్యం - పరిశుభ్రత, గణిత నమూనాలు మొదలైన అంశాలలో ఈ విజ్ఞాన మేళ నిర్వహిస్తున్నామన్నారు.

మన వనరులను కాపాడుకోవడం, నీరు, ఆహారం, విద్యుత్ శక్తి మొదలైన వాటిని వృథా చేయకపోవడం మన నిత్యజీవితంలో భాగం కావాలన్నారు.

విద్యార్థుల విజ్ఞాన శాస్త్ర ఆలోచనలు ప్రపంచ స్థాయిలోనే ఉండాలని ఏమీ లేదని, మన చుట్టూ ఉన్న స్థానిక సమస్యల గురించి ఆలోచించడం, వాటిని గుర్తించడం, వాటి పరిష్కారం దిశగా ఆవిష్కరణలు చేయడం విద్యార్థుల ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. సమస్య పెద్దది కాకముందే గుర్తించి, దాన్ని తొలి దశలోనే పరిష్కరించడం వల్ల దానివల్ల ఏర్పడే దుష్పరిణామాలని తొలగించుకోగలుగుతామని స్పష్టం చేశారు. ప్రకృతిని తల్లిలాగా చూసుకుంటే, ప్రకృతి కూడా మంచి ఫలితాలను ఇస్తుందన్నారు.

ప్రకృతితో మానవ జీవితం అనుసంధానించబడినప్పుడే నూతన ఆవిష్కరణలకు శాస్త్ర సాంకేతిక రంగ అభివృద్ధికి సార్థకత ఉంటుందని ప్రకృతికి అనుగుణంగా జీవన విధానం ఏర్పరచుకొని భవిష్యత్ తరాలకు నూతన ఆవిష్కరణలను అందించాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నింటి నుంచి ఈ ప్రదర్శనలో భాగస్వామ్యం ఉండడం సంతోషదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని, ఆలోచనల్,లో ప్రవర్తనలో వైజ్ఞానికత ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలల్లోని విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలను వినియోగిస్తూ విద్యార్థుల్లో శాస్త్రపరమైన ఆలోచనలు పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, వారిని బాల శాస్త్రవేత్తలుగా రూపొందించడానికి ఇన్స్పైర్ పురస్కారాల పేరుతో అధిక నిధులు వెచ్చిస్తున్నదని, దానిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజం మొత్తం ఇంజనీరింగ్ వైపు, వైద్యరంగం వైపు మాత్రమే కాకుండా విజ్ఞాన శాస్త్రం వైపు కూడా దృష్టి సారించాలని, తద్వారా శాస్త్రవేత్తలుగా ఎదిగి భారతదేశ శాస్త్ర సాంకేతికతను మరింత ఉన్నత దిశకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో బాల వైజ్ఞానిక ప్రదర్శన కొరకు మొత్తం 807 సైన్స్ ఎగ్జిబిట్ లు, 126 ఇన్స్పైర్ మనక్ ఎగ్జిబిట్లు వచ్చాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏడు అంశాల్ని ప్రదర్శనకు పెట్టామని, ప్రతి అంశం నుంచి ఉత్తమంగా వచ్చిన ఒక ప్రదర్శనను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు.

రెండవ రోజు బాల వైజ్ఞానిక మేళాకు విశేష స్పందన

విద్యార్థులు పరిసరాలను నిశితంగా గమనిస్తూ కొత్త ఆలోచనల వైపు మనసును మళ్ళించడం ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని శనివారం నుండి మూడు రోజులపాటు కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో జరుగుతున్న బాల వైజ్ఞానిక మేళను ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను ఆయన తిలకించారు. చుట్టూ ఉన్న పరిసరాల్లో, సమాజంలో నెలకొన్న సమస్యల్ని గుర్తించడం ద్వారా వాటికి పరిష్కార మార్గాలను కనుక్కోవడానికి ఆలోచన ఉండాలన్నారు.

ఆవిష్కరణలు అనుకరణతో కాకుండా సృజనాత్మకతతో కూడిన ఆలోచనలతో కూడుకొని ఉండాలని, విద్యాబోధన ప్రణాళికల్లో



శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఉంటుందని దానికి అనుగుణంగానే విద్యాభ్యాసం సాగాలన్నారు. తరగతి గదిలో నిర్వహించే బోధనాభ్యసన ప్రక్రియలు బోధన ప్రణాళికలకు అనుగుణంగా ఉంటూ రెండింటిని సమన్వయం చేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరించారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక మేళాకు విశేషణ స్పందన లభిస్తున్నదని, జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 2652 మంది విద్యార్థులు మేళకు వచ్చారన్నారు. సోమవారం చివరి రోజు కాబట్టి మిగతా పాఠశాలల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్. భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, కొత్తపల్లి, గంగాధర, సైదాపూర్, గన్నేరువరం మండలాల విద్యాశాఖాధికారులు ఆనందం, ఏనుగు ప్రభాకర్ రెడ్డి, కట్ట రవీంద్రాచారి, రామయ్య, గాజుల రవీందర్, స్తంభంకాడి గంగాధర్,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 3న జర్నలిస్టుల సమస్యలపై మహా ధర్నా

## టీయుడబ్ల్యూజె (ఐజెయు) ఆద్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్30:

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజే (ఐజెయు) ఆద్వర్యంలో హైదరాబాద్ లో డిసెంబర్




3న మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీయుడబ్ల్యూజె (ఐజేయూ) జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజ్జే హనుమకొండ జిల్లా కమిటీ ఆద్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్ లో నిర్వహించతలపెట్టిన మహా ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి,తోట సుధాకర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తాత్సార దోరణి అవలంబిస్తూ కాలయాపన చేస్తున్నదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఈ క్రమంలో ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు వడిసెంబర్ 3న హైదారాబాద్ మాసాబ్ ట్యాంక్ రాష్ట్రసమాచార కమీషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజె (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్ మోహన్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయ కార్యదర్శి డాక్టర్ పాడిశెట్టి విష్ణు వర్ధన్, సీనియర్ నాయకులు సిహెచ్ సోమనర్సయ్య, ఎం. రాజేంద్రప్రసాద్, అనుముల రవి, దేవేందర్, ఎండి ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ, ప్రత్యేక సమావేశం

## జిల్లా పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 30 (భారత శక్తి): జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భద్రతా చర్యలను సమీక్షిస్తూ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆధ్వర్యంలో, జిల్లాలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగేందుకు చేపట్టవలసిన చర్యలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు, చెక్‌పోస్టుల కార్యకలాపాల పర్యవేక్షణ, సున్నితమైన ప్రాంతాల గుర్తింపు, రూట్ మొబైల్ వాహనాల మానిటరింగ్ వంటి అంశాలపై వివరంగా చర్చించారు.ప్రజలు భయాందోళనలేమీ లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోడానికి అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఏవైనా అనుమానాస్పద కదలికలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు గమనించిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని తెలియజేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన ఐపీఎస్, జిల్లాలో ఉన్న అందరూ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.





# వైబ్రాంట్ అకాడమీ స్కాలర్ షిప్ టాలెంట్ టెస్ట్ కు విశేష స్పందన

## డైరెక్టర్ చిట్టెటి రాజేందర్ రెడ్డి వెల్లడి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్30:

హనుమకొండ నక్కలగుట్ట లోని వైబ్రాంట్ అకాడమీ కోటా



రాజస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్కాలర్ షిప్ ఎర్లీ అడ్మిషన్ టాలెంట్ టెస్ట్ కు విశేష స్పందన లభించిందని వైబ్రాంట్ అకాడమీ డైరెక్టర్ చిట్టెటి రాజేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా వైబ్రాంట్ అకాడమీ ప్రిన్సిపాల్ శేషు కుమార్ మీడియాతో మాట్లాడుతూ వైబ్రాంట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కాలర్ షిప్టా లెంట్ టెస్ట్ కు భారీ స్థాయిలో 750 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

దేశంలోనే అగ్రగామి సంస్థ అయిన వైబ్రాంట్ అకాడమీ లోని వేల సంఖ్యలో విద్యార్థిని,విద్యార్థులు ఐఐటీ,నీట్ లలో సీట్లు సాధించారని తెలిపారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు గొప్ప అవకాశంగా భావించి టాలెంట్ టెస్ట్ కు అధిక సంఖ్యలో హాజరయ్యారు.మొదటి ఐదు ర్యాంకులు సాధించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు ఉచితమని తెలిపారు.అనంతరం టాలెంట్ పరీక్షలో ప్రతిభ కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులకు మార్కుల ఆధారంగా ట్యూషన్ ఫీజు రాయితీ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమీ హెడ్ రామకృష్ణ, ఎజిఎంలు గుండాల రాజు,మాలోత్ నారాయణ సింగ్,దండు రాజు,కో ఆర్డినేటర్ రాము,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి..

## అప్పుడే గోవధ ఆగిపోతుంది.. పశుసంపద పెరుగుతుంది

## రైతు సంక్షేమ సేవా సంఘం అద్యక్షులు కొమ్ము ప్రేంసాగర్ యాదవ్

హైదరాబాద్నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని అప్పుడే గోవధ ఆగిపోతుంది.. పశు సంపద పెరుగుతుందని రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అద్యక్షులు కొమ్ము ప్రేంసాగర్ యాదవ్ అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలన్న డిమాండ్ తో భారత ప్రధాని నరేంద్ర మోడీ కి లక్ష పోస్టు కార్డులతో లక్ష సంతకాలతో ఉద్యమాన్ని చేపట్టాస్ బోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ భూమండలంలో ఆవు పవిత్రమైన మరియు ప్రజలకు ఉపయోగపడే జీవి ఏదైనా ఉందంటే అది ఆవు మాత్రమే అలాంటి ఆవులను ఈరోజు చాలామంది తెలియక గోవధ చేయడం వలన ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయి కాబట్టి ఆవులను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నది ఆవులను కాపాడాలని ఉద్దేశ్యముతో ఆవును జాతీయ జంతువుగా వెంటనే ప్రకటించాలని అప్పుడే గోవద ఆగుతుందని భారత ప్రధాని నరేంద్ర మోడీ కి లక్ష మందితో లక్ష పోస్టు కార్డులు మరియు లక్ష మందితో సంతకాలు సేకరించి ఒకే రోజు వారికి అందేలా పంపించటానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ మంచి కార్యక్రమానికి ఇరు రాష్ట్రాల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేసారు.ఆవులు ప్రతి సంవత్సరం లక్షలాదిగా గోవధకు భలవుటం బాధాకరం కాబట్టి మన గోమాతను కాపాడుకోవలసిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఆవులతో బహు ప్రయోజనాలు ప్రజలకు ఉన్నవని ఆవు పకృతిపై ఉంటే ప్రజలు పకృతి బాగుంటది. అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారు కాబట్టి భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని



ఆవును కాపాడుదాం గోమాత బాగుంటే భూమాత కూడా బాగుంటదని, ఈ కార్యక్రమానికి గో ప్రేమికులు ఎవరైనా ఉంటే మాతో సహకరించాలని,అందుకు సలహాలు సూచనలు ఇవ్వాలని ప్రేంసాగర్ యాదవ్ కోరారు. వివరాకలకు మా ఫోన్ నెంబర్. 9291463969. సంప్రదించాలని కోరారు.

## డిసెంబర్ 01 వ తేదీన జిల్లా లోని అన్ని పారశాలలు, కళాశాలలు,అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ సెలవు: జిల్లా కలెక్టర్

"'దిత్వా"తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు,మరియు అంగన్వాడీ కేంద్రాలకు డిసెంబర్ 01వ తేదీన (సోమవారం) సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## దూసుకొస్తున్న దిత్వా తుపాన్.

అమరావతి నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి): నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో ఏర్పడిన దిత్వా తుపాను ఉత్తర వాయవ్య దిశగా వేగంగా కదులుతోంది. ప్రస్తుతం ట్రికోమలికి వాయువ్యంగా 80 కి.మీ.లు, పుదుచ్చేరికి దక్షిణ ఆగ్నేయంగా 330కి.మీ.లు, చెన్నైకి దక్షిణంగా 430 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైంది. గడిచిన ఆరు గంటల్లో 7 కి.మీ.లు వేగంతో తుపాన్ కదిలింది.రేపు తెల్లవారుజామున తీవ్రవాయుగుండంగా తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉంది.

# డిసెంబర్ 01 న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు:జిల్లా రెవెన్యూ అధికారి

వై ఎస్ ఆర్ కడప,నవంబర్ 30(భారత శక్తి):

దిత్వా తుపాను నేపథ్యంలో జిల్లా లో డిసెంబర్ 01 సోమవారం జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతం కురిసే అవకాశం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కలెక్టరు గారి కార్యాలయం లో నిర్వహించ వలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ను రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.

ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గుర్తించి వ్యయ ప్రయాసాలకు ఓర్చి జిల్లా కేంద్రం నకు సమస్యల పరిష్కారానికి రావద్దని వారు ప్రకటన లో తెలిపారు.

అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డి ఆర్ ఓ విజ్ఞప్తి చేశారు.

# గుమ్మడిదల రామాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**- ప్రాకారం నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**- పటాన్చెరు ఎమ్మెల్యే జిఎంఆర్**

గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి నవంబర్ 30:

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో గల రామాలయం జీర్ణోదారణ పనులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం హానర్ ల్యాబ్ పరిశ్రమ సహకారంతో ఒక కోటి పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో



చేపట్టనున్న ఆలయం ప్రాకారం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాన్ని దైవత్వం ఉట్టిపడేలా పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ దశరథ్, సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు బాల్ రెడ్డి, పరిశ్రమ ప్రతినిధి రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 3న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలి:మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

హుస్నాబాద్ ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్ది ఉత్తర తెలంగాణ కోనసీమ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. డిసెంబర్ 3 వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గ కేంద్రంలో పర్యటిస్తు సిద్దిపేట కలెక్టర్ హైమవతి తో కలిసి సీఎం సభకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాగునీటి సౌకర్యాలు , పార్కింగ్ ప్రదేశాలు ,బద్రత తదితర వాటిపై అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రి మీడియా తో మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు పూర్తి చేసుక్కనదని, హుస్నాబాద్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ కి ,%ాుజ% (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)కు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. రాజీవ్ రహదారి నుండి హుస్నాబాద్ వరకు 4 లేన్ కు, అక్కన్నపేట నుండి హుస్నాబాద్ రోడ్డుకు ,కోహెడ లో నిర్మించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కి ,గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే స్విమ్మింగ్ పూల్ ,వెటర్నరీ హాస్పిటల్ ,ఫిష్ మార్కెట్ , వెజిటబుల్ మార్కెట్ ప్రతిపాదనలు చేశారని వాటికి సంక్షన్ రాగానే వాటి శంకుస్థాపన చేస్తామని తెలిపారు.హుస్నాబాద్ మున్సిపాల్టీ అభివృద్ధికి కేటాయించిన 20 కోట్లు అభివృద్ధి పనులకు , 8 కోట్ల రూపాయలతో హుస్నాబాద్ లో అధునాతన డ్రైవింగ్ ట్రాక్ తో కూడిన ఆర్టీఏ కార్యాలయానికి ,6 కోట్ల రూపాయల తో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు కు , ఉమ్మాపూర్ లో ఉన్న ఫారెస్ట్ లో వాకింగ్ ట్రాక్, ఇతర మౌలిక సదుపాయాలతో 10 కోట్ల రూపాయల తో అర్బన్ పార్క్ ఏర్పాటు కు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల కింద బస్సులు ఇస్తారు. హైదరాబాద్ నుండి హుస్నాబాద్ ఎక్స్



ప్రెస్ బస్సు ప్రారంభిస్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు హాస్టల్ కి వెళ్లడానికి దూరం అవుతుండడంతో 70 మంది విద్యార్థులకు సైకిల్ లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఫేజ్ 1 కింద కరీంనగర్ కొత్తపల్లి హుస్నాబాద్ కి ఫోర్ లైన్ రోడ్డు కి ,250 పడకల ఆసుపత్రి కి శంకుస్థాపన చూసుకొని పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎల్లమ్మ చెరువు , మహా సముద్రం గండి టూరిజం అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.పల్లె చెరువు ,కొత్త చెరువు అభివృద్ధి జరుగుతుందన్నారు. హుస్నాబాద్ లో రింగ్ రోడ్డు ఉండాలి ,కబడ్డీ అకాడమీ , డ్రింకింగ్ వాటర్ ఫెసిలిటీ , స్టేడియం అభివృద్ధి ,డిగ్రీ కాలేజీ పక్కన స్థలంలో పార్క్ అభివృద్ధి కి ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేస్తున్నారు.

వంగర లో నవోదయ పాఠశాలకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్కతుర్తి లో జంక్షన్ అభివృధి చేసుకున్నామని అక్కడే ఐఐటీ బాసర ఏర్పాటు కు కృషి చేస్తున్నాంమని హామీ ఇచ్చారు. గోడౌన్ ల నిర్మాణాలకు మంజూరు అయిందనీ,హుస్నాబాద్ లో పారిశ్రామిక కారిడార్ కి భూసేకరణ పూర్తయిందని దీని ద్వారా ఉ పాధి కల్పన జరిగి ఆర్థిక వృద్ధి సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.గౌరవెల్లి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు అవుతున్నాయని ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ సస్య శ్యామలం చేస్తామని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు , సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు , మహిళలకు చీరలు, సున్నా వడ్డీ రుణాలు , పంపిణీ జరుగుతుందని ,గ్రామగ్రామాన స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సర్పంచ్ ఎన్నికలపై చిగురు మామిడి, హుస్నాబాద్ రూరల్ , టౌన్ , ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయడానికి జన సమీకరణ లో భాగంగా ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు పై నేతలకు దిశా నిర్దేశం చేశారు.నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయాలనీ సూచించారు. అందుకోసం నేతలంతా సమన్వయం చేసుకోవాలని సూచించారు. పార్టీ బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటూ ఇతర పార్టీల నుండి చేరాలనుకునే నేతలు స్థానిక నేతల సమ్మతితో చేరేలా చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులకు సూచించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థి ఒక్కరే ఉండి వారు గెలవడానికి మిగిలిన నేతలంతా ఐక్యంగా పని చేయాలనీ ఆదేశించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అయిన నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళు ,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కి గ్యాస్, సన్న వడ్లు బోనస్ , రుణమాఫీ ,రైతు భరోసా , ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తన గెలుపు కు ఎలా పని చేశారో మీ అందరి గెలుపు కోసం పనిచేస్తా అని హామీ ఇచ్చారు..కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలపై అప్రమత్తంగా ఉండాలి: ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు



కరీంనగర్, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నిబంధనల ప్రకారంగా అప్రమత్తంగా ఉండాలనీ సాధారణ ఎన్నికల పరిశీలకులు వి.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం చిగురుమామిడి మండలం మండలం బొమ్మనపల్లిలో గ్రామ పంచాయతి ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు ముఖ్యమైన ఘట్టమని, పత్రాలలో ప్రతి అంశం సరిగా ఉన్నాయో, లేవో జాగ్రత్తగా నిబంధనల ప్రకారం చూడాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన కర పత్రాలు, గోడపత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత మండల అధికారులను సంప్రదించాలని తెలిపారు. . ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

# 7000 మంది ఉద్యోగులపై పిడుగు.. రిటైర్మెంట్ బెనిఫిట్లు రాకుండా ఆర్డినెన్స్

హైదరాబాద్,నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి)

రాష్ట్రంలోని సుమారు ఏడు వేల మంది ఉద్యోగులకు పిడుగులాంటి వార్త ఇది. తాత్కాలిక ప్రాతిపదికన నియామకమై ఆ తర్వాత వివిధ ప్రభుత్వాల హయాంలో రెగ్యులరైజ్ అయిన వారు, నాన్ మస్టర్‌రోల్ (ఎన్ఎంఆర్)గా చేరినవారు, న్యాయస్థానాల ద్వారా తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయించుకున్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్లను ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆగమేఘాలపై ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్ గవర్నర్ పేరున గెజిట్ కూడా విడుదలైంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని సుమారు ఏడువేల మంది ఉద్యోగులు నికరంగా రూ.20వేల కోట్లు నష్టపోనున్నారు. ఈ గెజిట్ వల్ల రూ.20వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు మిగులుతాయని ప్రభుత్వం చెప్తున్నది.రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారం కాకూడదంటే ఈ ఉద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్లు ఏమీ ఉండకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, సాధారణ పరిపాలనాశాఖల అధికారులు ఏకంగా ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చారు. ఈ నివేదికను ప్రభుత్వం మంత్రివర్గ సమావేశాల్లో చర్చించి ఆమోదించింది. అందుకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఇచ్చింది. ఈ నెల 25న గెజిట్ కూడా జారీ అయింది. గెజిట్ కాపీ, ప్రభుత్వ ఉత్తర్వులను దాచిపెట్టారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం"

## "స్థానిక ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం"

## "సర్పంచ్,వార్డ్ సభ్యుల్లో ఒక ఓటు తేడాతో గెలుపు ఓటములు అనేకం"

## "ఓటరు మీ ఆయుధం ఉపయోగించు"

అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ గారు ప్రజాస్వామ్యం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ప్రజాస్వామ్యం అంటే 'ప్రజల కొరకు,ప్రజల చేత,ప్రజలే ఎన్నుకొనే విధానం అన్నారు".ప్రజాస్వామ్యం అనేది ఒక రాజకీయ ప్రభుత్వ ఏర్పాటు చేసే ప్రక్రియ. ఇందులో ప్రజలు లేదా ఓటర్లు వేసే ఓటువల్ల ఆ ప్రభుత్వాన్ని నిర్ణయిస్తారు.

1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పాటైంది. కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 2011 జనవరి 25వ తేదీ నుండి నిర్వహిస్తోంది.18 ఏళ్లు నిండిన యువతకు కొత్త ఓటు కల్పించడం, ఓటు సవరణ, ఓటు విలువ తెలియ చేయడం, ఓటు ప్రాముఖ్యతను చెప్పేలా ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. 2011 జనవరి 25 రోజున అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అధ్యక్షతన జరిగిన భారత కేంద్ర మంత్రి మండలి సమావేశంలో ఈ చట్టం అమలుకు ఆమోదం లభించింది.


"ఓటు" అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులు అందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా ఓటు హక్కును కల్పిస్తున్నది. ఓట్లు వేసిన అభ్యర్థులను "ఓటర్లు" అని పిలుస్తారు. దేశ అభివృద్ధి కోసం నాయకులను ఎన్నుకోవటానికి ఓటు అనేది ఒక వజ్రాయుధం. భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కు, పాలకులను ఎన్నుకోవడమే ఓటు ముఖ్యఉద్దేశం. ఓటు హక్కును సుమారు 20 నుంచి 30 శాతం ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ సద్వినియోగం చేసుకోవటం లేదు. ప్రధాన కారణం ఓటు ప్రాముఖ్యత, విలువ తెలియకపోవడం, సరి అయిన అవగాహన లేకపోవడం. నూరుశాతం పోలింగ్ సాధించే దిశగా ఎన్నికల సంఘం ఓటుప్రాముఖ్యత, నమోదుపై ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఓటుపై చైతన్యం తీసుకురావటం, యువతను ఓటు నమోదుకు ప్రోత్సాహించేందుకు ప్రయత్నం చేస్తోంది. మంచి పాలకులను ఎన్నుకోవటానికి ఓటు అనేది ప్రజలకు అస్త్రం.

ఎన్నికైన ప్రజాప్రతినిధులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉ ంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని దేశాభివృద్ధికి సేవాభావం ఉ న్న ప్రజాప్రతినిధులను స్వేచ్ఛగా, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నది ఎన్నికల సంఘం ముఖ్యఉద్దేశం. ప్రజలకు ప్రజా స్వామ్యం పై నమ్మకం,గౌరవం ఉ న్నాయి. ప్రజాస్వామ్యము ఎన్నికలపైనే ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల సంఘం కీలకపాత్ర పోషిస్తున్నది. ఏ రాజకీయ పార్టీకి తలవంచక స్వతంత్రంగా తన విధులను నిర్వర్తిస్తుంది. కేంద్ర స్థాయిలో భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల సంఘాలు విధులను సమర్థంగా నిర్వహిస్తున్నాయి. ప్రజాస్వామ్యం మనుగడ ఓటరుపై ఆధారపడి ఉన్నందున ఓటర్ కు ప్రాధాన్యత పెరిగింది.రాజకీయ వ్యవస్థ పారదర్శకంగా ఉండాలనే లక్ష్యం తో యువతను భాగస్వామ్యులు చేయాలని ఓటు ప్రాముఖ్యతను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నోవిధాలుగా ప్రచారం చేస్తుంది.

కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న గుర్తింపుకార్డులు అందిస్తుంది.ఓటు ప్రాముఖ్యత, కొత్త ఓటు నమోదు, చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంది. ప్రజాస్వామ్యములో ఓటు హక్కుతోనే వార్డు సభ్యుల నుంచి రాష్ట్రపతి వరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. భారతదేశంలో 1952 నుండి సార్వత్రిక వయోజన ఓటు హక్కు వినియోగంలోకి వచ్చింది. ఇంతకు ముందు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేవారు. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వినియోగిస్తున్నారు. అంతే కాక మరింత పారదర్శకంగా ఉండడం కోసం,వి వి పాట్ లను కూడా ఏర్పాటు చేశారు.18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటు హక్కు పొందాలంటే దరఖాస్తు చేసుకోవాలి. ఓటు నమోదుకు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తల్లిదండ్రుల ఆధారంగా జనన ధ్రువీకరణ లేదా పదవ తరగతి మెమో ద్వారా బూత్ లెవెల్ అధికారులకు లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.అందజేసిన 15 రోజుల్లోగా పొందుపర్చిన వివరాల ఆధారంగా పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారులు ఓటరు కార్డును లబ్ధిదారులకు పోస్ట్ ద్వారా అందజేస్తారు. లేదా మీ సేవా కేంద్రాలనుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

'భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్య పటిష్టత ఎన్నికలపైనే ఆధారపడి ఉంటుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల చేతిలో దేశ భవిష్యత్‌ను నిర్ణయించేంది ఓటర్లే. దేశంలో యువత బలం ఎక్కువగా ఉంది. కాబట్టి దేశ భవిష్యత్ దృష్ట్యా యువత ఓటు నమోదు చేసుకోవటంతో పాటు దానికి వినియోగించాలి. మనది ప్రజాస్వామ్య దేశమని, మన రాజ్యాంగం చాలా గొప్పదని, అనేక మతాలు, జాతులు, భాషలు, కులాలు వున్నా భిన్నత్వంలో ఉన్న గొప్ప దేశం మనది, కాబట్టి ఓటు హక్కు ను కూడా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.ప్రజాస్వామ్యంలో మాత్రమే భావ స్వేచ్ఛకు అవకాశం వుంటుంది. ముఖ్యంగా యువత, విద్యాధికులు ఓటు హక్కును వినియోగించుకోవాలి. అధిక శాతం గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని గత ఎన్నికల శాతం బట్టి తెలుస్తుంది.పట్టణ ప్రాంత ప్రజలు, యువత ఓటు హక్కును వినియోగించుకుని రాజ్యాంగాన్ని గౌరవించుకుని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. మన దేశంలో ఓటు వేయని వారూ దాదాపు 30 శాతం ఉన్నారని అది సున్నాకు రావాల్సిన అవసరం ఉందని గుర్తించవలసిన భాధ్యత మనందరిది.న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలకంటే శక్తివంతమైన పాత్ర శాసనాలు తయారుచేసే పార్లమెంట్, అసెంబ్లీలది. ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సినది రాజకీయ నేతలే. అలాంటి నేతలను ఎన్నుకొనేది ఓటర్లే. వయోజనులైన ప్రతి వ్యక్తికీ ఎలాంటి భేదభావాలు లేకుండా ఓటు హక్కును కల్పించింది మన రాజ్యాంగం. రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక, సమానత్వాన్ని సాధించాలని, రాజ్యాంగం యొక్క లక్ష్యం కూడా అదేనని, రాజకీయ ప్రజాస్వామ్యం సామాన్యులకు అందకపోతే బాధితులు ఈ రాజ్యాంగ వ్యవస్థను కూల్చేస్తారని నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్‌కు సమర్పిస్తూ డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ గారు హెచ్చరించారు. కావునా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఒక ఆయుధం.దానిని సక్రమంగా ఉపయోగిద్దాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.

"భారతదేశ పౌరులమైన మేము ప్రజస్వామ్యంపై విశ్వాసంతో, దేశ సంప్రదాయాలు, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, జాతి, మతం, కుల, వర్గ, భాషాభేదం లేకుండా ప్రలోభాలకు గురికాకుండా నీతి, నిజాయితీగా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించు కుంటానని ప్రతిజ్ఞ చేయుచున్నాను"' అని ప్రతిజ్ఞ చేస్తూ ఓటరుగా నమోదుకావాలి, ఓటు హక్కు వినియోగించుకోవాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.



గడప రఘుపతిరావు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

9963499282

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య పరీక్షల ద్వారా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఖాన్ పుర లోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో సితార హాస్పిటల్ సౌజన్యంతో మహమ్మద్ జాఫర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సుడా చైర్మన్ ప్రారంభించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య శిబిరాల ద్వారా ఆరోగ్య సమస్యలు ఉంటే బయటపడే అవకాశం ఉంటుందని మొదటి దశలోనే రోగ నిర్ధారణ జరుగుతే మందుల ద్వారా ఆరోగ్య సమస్యను పరిష్కారం చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఉచిత మెగా శిబిరంలో 350 మందికి పైగా హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకొని డాక్టర్ల సూచన మేరకు మందులు తీసుకొని వెళ్లారు. ఈ వైద్య శిబిరం సితార హాస్పిటల్ ఎండి డాక్టర్ జాదవ్ రాజ్ కుమార్, డాక్టర్ వెంకట్ భరద్వాజ్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో సమద్ నవాబ్,ముఫ్తీ మహమ్మద్ అలీమొద్దిన్,ఎంఎ కరీం ఖాద్రి,మహమ్మద్ రఫీక్, సయ్యద్ మాజిద్ ఫజల్,ఎంఎ ముజీబ్,జీడి రమేష్,షెహన్నా,శబానా మహమ్మద్, మసూమ్ ఖాన్,బషీర్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మకైన గ్రామాల్లో పటిష్టభద్రత : అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

సమస్యాత్మకమైన గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆదేశించారు. కరీంనగర్ పోలీస్ కమీషనరేట్



పరిధిలోని హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై దృష్టి సారించారు. హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో రికార్డులను, నిర్వహణ తీరును పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. వీణవంక మండలం చల్లూర్ వంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.

హత్య కేసు సంఘటనా స్థలం పరిశీలన

జమ్మికుంట ప్రాంతంలో ఇటీవల జరిగిన హత్య కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. కేసు వివరాలు, సాక్ష్యాలను పరిశీలించి, సంఘటన జరిగిన స్థలాన్ని స్వయంగా సందర్శించి, క్షుణ్ణంగా పరిశోధన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణ తనిఖీ కార్యక్రమంలో ఏసీపీ మాధవి , హుజురాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

భూపాలపల్లి, నవంబర్ 30(భారత శక్తి): భూపాలపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ శాసన సభ్యులు గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో భూపాలపల్లి మండలం, రామ్ నాయక్ తండా గ్రామ వాస్తవ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోరిక అమృ నాయక్ గారు కాంగ్రెస్ పార్టీ వీడి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరడం జరిగింది.

గత ప్రభుత్వం చేసిన పనులు అదేవిధంగా రాంనాయక్ తండాను ప్రత్యేకంగా గ్రామపంచాయతీ కేటాయించినందుకు గాను కేసీఆర్ చేసిన పనులు మరియు పథకాలు చాలా



బాగున్నాయని తెలిపారు.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే తప్ప ఈ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ ఒకటి కూడా నెరవేర్చలేదని తప్పకుండా రానున్న కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కేసిఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, వారు ప్రవేశపెట్టిన పథకాలు నచ్చి బీఆర్ఎస్ పార్టీలో ఇతర పార్టీ నాయకులు చేరడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పోరిక జగన్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అంగోత్ సంపత్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోరిక ప్రేమ్ సింగ్ నాయక్,పోరిక ప్రతాప్ సింగ్,మాజీ వార్డు సభ్యులు విస్లావత్ రాజ్ కుమార్,పోరిక సురేష్ కుమార్, పోరిక కిషోర్,పాద్య భాస్కర్, ధరంసోత్ బాల్ రాజ్,పోరిక శ్రీరామ్, భూక్య రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమా పై రైతుల్లో అవగాహన పెంచాలి

### వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్

కడప, నవంబర్ 30(భారత శక్తి): అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా పై బ్యాంకర్ల, వ్యవసాయ శాఖాధికారులు జిల్లా రైతుల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుభారత ప్రభుత్వం 2025 డిసెంబర్ 1 నుండి 7 వరకు 10వ పంట బీమా వారోత్సవాన్ని మరియు 2025-26 రబీ కోసం నెల రోజుల పాటు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీని ప్రకారం, మన జిల్లాలో పంటల బీమా పైన విస్తృతమైన అవగాహన మరియు రైతుల నమోదుపై బ్యాంకులు, బీమా కంపెనీలు, సిఎస్‌సిలు మరియు వ్యవసాయ ఫీల్డ్ ఫంక్షనరీలతో సహా వాటాదారుల చురుకైన భాగస్వామ్యంతో ఈ ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. రబీ, 2025-26 సీజన్లో నువ్వుల పంటకు 180రూ, వేరుశనగ కు 480 రూ, పెసలకు270రూ, జొన్నలకు315రూ, మినుములకు 285 రూ, వరికి 630రూ, ప్రొద్దుతిరుగుడు కి 300రూ, బుడ్డ శనగ కి 480 రూ, ఒక ఎకరానికి ప్రీమియం రైతులు చెల్లించవలసి ఉంటుందన్నారు.

## జాబ్ మేళను సద్వినియోగం చేసుకోండి: యాడ్ ఎన్జీవో వ్యవస్థాపకులు కొంకటి రవి

కరీంనగర్, నవంబర్, 30(భారతశక్తి ప్రతినిధి):

రెటైల్ స్పార్క్, యూత్ యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంలో డిసెంబర్ ఒకటో తేదీన కరీంనగర్ పట్టణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు యాడ్ ఎన్జీవో వ్యవస్థాపకుడు కొంకటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ముకరంపురలో గల ఎస్ ఆర్ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న తమ కార్యాలయంలోఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.




కరీంనగర్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమ్యూనిటీ స్పోక్స్ పర్సన్స్, ప్యాకింగ్, సార్టింగ్, డెలివరీ విభాగాలలో తొలి దశలో 50 మంది నిరుద్యోగులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ. 15000 నుండి వేతనం ఉంటుందన్నారు. రైతులను నేరుగా వినియోగదారులతో కలపడం, నాణ్యమైన ఆహార ఉత్పత్తులు మార్కెట్ ధరల కన్న తక్కువతో నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చడం, చిన్న దుకాణదారులను డిజిటల్ విధానంలో అనుసంధానం చేయడం లక్ష్యంతో రెటైల్ స్పార్క్ సంస్థ పనిచేస్తున్నదని వివరించారు. రైతుల అభివృద్ధి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, చిన్న దుకాణదారుల ఆర్థిక ప్రగతికి రెటైల్ స్పార్క్ దోహదపడుతుందన్నారు. అదేవిధంగా మహిళ స్వయం సహకార సంఘాల ఉత్పత్తులను కూడా ఈ సంస్థ మార్కెటింగ్ చేస్తుందన్నారు. మహిళ సంఘాలలో సభ్యులుగా ఉన్న కుటుంబాలకు చెందిన యువతకు ఉద్యోగ అవకాశాలలో తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ ప్రగతి యజ్ఞంలో భాగస్వాములు కాదలచిన నిరుద్యోగ యువతీ,యువకులు ఉపాధి అవకాశాల కోసం కింది ఫోన్ నెంబర్ లో (94418 00040) సంప్రదించాలనిసూచించారు.

## పర్యావరణహితానికి పాటుపడండి !

### - వాసవి క్లబ్ కు ఎంపీ రఘునందన్ రావు సూచన
### - వాసవి క్లబ్ సేవలు అభినందనీయం : నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 30:

వాసవి క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవలను అందించడం అభినందనీయమని, అదే విధంగా ప్లాస్టిక్ రహిత వ్యాపారాన్ని చేయడం ద్వారా పర్యావరణహితానికి కూడా కృషి చేయాలని మెదక్



ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సంగారెడ్డి సమీపంలోని కంది లక్ష్మీనరసింహ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం నాడు జిల్లా గవర్నర్ ఇరుకుల్ల ప్రదీప్ ఆధ్వర్యంలో స్వదీపో త్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ రఘునందన్ రావు తో పాటు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ వాసవి క్లబ్ వారు కేవలం తమ వారికే కాకుండా ,మొత్తం సమాజం కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. దీనివల్ల సమాజంలో సేవా తత్పరత పెరుగుతున్నదని చెప్పారు. ధార్మిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం వల్ల శాంతి నెలకొంటుందని అన్నారు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలని తమ వ్యాపారాన్ని ఇతర కవర్ల ద్వారా నిర్విఘ్నంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు ప్రధాని మోడీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని ఆయన బాటలో ప్రతి ఒక్కరం నడవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా గవర్నర్గా ఇరుకుల ప్రదీప్ అనేక సేవా కార్యక్రమాలు జరపడం అభినందనీయమని తెలిపారు హైదరాబాదు రంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి వాసవి క్లబ్ ప్రతినిధులంతా సంగారెడ్డికి తరలిరావడం సంతోషకరమన్నారు ప్రతి ఒక్కరు తమ వంతుగా సామాజిక సేవ చేయడం అలవర్చుకోవాలని ఎంపీ అన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. త ద్వారా తమ ప్రాంతానికి, దేశానికి సేవ చేయాలని పేర్కొన్నారు. వాసవి క్లబ్ గవర్నర్ ఇరుకుల ప్రదీప్ తో పాటు వారి బృందాన్ని అభినందించారు. వాసవి క్లబ్ కు తన వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని అంజిరెడ్డి పేర్కొన్నారు. టీజేఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులు కేవలం డబ్బు సంపాదనకే ప్రాముఖ్యత ఇస్తారని అనుకోవడం సరికాదన్నారు. డబ్బు సంపాదించి దానిని దాచి పెట్టుకోవడమే చూశాము కానీ ఆర్యవైశ్యులు మాత్రం తమ సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా పేదలకు దుప్పట్లు పంచడం పాఠశాలలకు బల్లాలు ఇవ్వడం వినాయక చవితి సమయంలో మట్టి గణపతులను ఉచితంగా ప్రజలకు పంచడం తాను స్వయంగా చూశానని ఆమె అన్నారు తాను కూడా తోపాది అనంత కిషన్ ద్వారా ఈ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారని ఆమె వివరించారు తాను కానీ తన భర్త జగ్గారెడ్డి కానీ ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె తెలిపారు. తాము సంగారెడ్డిలో ఆర్యవైశ్యులతో కలిసిమెలిసి ఉన్నామని, దీనివల్ల తమకు కూడా శాంతి ,సేవా తత్పరత అలవాటు అయ్యాయని నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇరుకుల్ల ప్రదీప్ స్వాతి దంపతులను ఆమె అభినందించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ కేవలం ఆర్యవైశ్యులకే కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు వాసవి క్లబ్ ద్వారా సేవలు అందించడం గర్వకారణం అన్నారు. పేద వర్గాలు ఏ కులం వారైనప్పటికీ, ఏ మతం వారైనప్పటికీ వాసవి క్లబ్ కమిటీ వాళ్లు తమ వంతు సాయం చేస్తున్నారని కొనియాడారు. నిరంతరం సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు మునుముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఇప్పటివరకు తన పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా గవర్నర్ ఇరుకుల్ల ప్రదీప్ తెలిపారు. వివిధ క్లబ్బులకు ఈ సందర్భంగా మెమెంటోలు అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధ సూర్యప్రకాశరావు, ఇతర ముఖ్యులు మానేపల్లి రామారావు ,పుల్లూరు ప్రకాష్, చందా శ్రీధర్, దర్శి శ్రీనివాసరావు గుప్తా, సి డి సి మాజీ చైర్మన్ విజయేందర్ రెడ్డి, గంప శ్రీనివాస్, భానూరి నరసింహులు, మా శెట్టి ఉపేందర్ మ్యాడమ్ రాధా కిషన్, బెజుగం శ్రీనివాస్ జూలకంటి బుచ్చిలింగం, కొంపల్లి విద్యాసాగర్,తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, కెమిస్ట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్ కుమార్, కంది చందు గుప్తా, వనం నరేందర్ పుట్నాల లక్ష్మణ్, కటకం శ్రీనివాస్, శ్రీరాం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా

### రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి

కరీంనగర్, నవంబర్ 30(భారతశక్తి ప్రతినిధి:

కొండగట్టులో అర్ద రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలోనిరుపేద చిరు వ్యాపారులకు భారీగా నష్టం జరిగిందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద వ్యాపారుల దుకాణాలు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన వాటిని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలి. అగ్ని ప్రమాదంలో విద్యార్థులు చదువుకున్న స్టడీ సర్టిఫికేట్ కాలిపోయినాయి. కావున



చదువుకున్న విద్యార్థులకు వారి స్టడీ సర్టిఫికెట్లును విద్యాశాఖ అధికారులతో విచారణ జయించి తిరిగి వారికి వర్జినల్ సర్టిఫికెట్లు ఇప్పించాలి. తక్షణమే వారికి నివాస గృహాలు ఏర్పాటు చేయాలి వారు కోలుకునే వరకు. చిరు వ్యాపారులకు ఆహారం కింద వారికి ఆహార పదార్థాలు అందించాలి. ఈ ప్రమాదానికి నిర్లక్ష్యంతో వహించిన అక్కడున్న విద్యుత్ శాఖ డిఈ. ఏఈలపై కఠిన చర్యలు తీసుకోవాలనిరిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున డిమాండ్ చేశారు. ప్రమాదాలు పునవృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. వెంటనే నిరుపేద చిరు వ్యాపారులను ఆదుకోవాలి అని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు అన్నారు.

## గంజాయి విక్రయాలకు అడ్డుకుంటే హత్య చేయడం దుర్మార్గం

### పెంచలయ్య ను హత్య చేసిన ఆగంతకులను కఠినంగా శిక్షించాలి

బద్వేలు భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 30:

యువత గంజాయి,డ్రగ్ కు బానిసలు కావద్దని, చెడు వ్యాసానాలకు గురై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తన ఆటపాటలతో యువతను చైతన్యం చేస్తున్న డివైఎఫ్ఐ నెల్లూరు నగర నాయకులు పెంచలయ్యను హత్య చేసి కిరాతకంగా చంపిన కిరాయి గుండాలను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ)బద్వేలు పట్టణ కమిటి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద గల భగత్ సింగ్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబులు మాట్లాడుతూ.... నెల్లూరు జిల్లాలోని డివైఎఫ్ఐ నగర నాయకులు ప్రజానాట్యమండలి రూరల్ కార్యదర్శి కె.పెంచలయ్య ను కిరాయి గుండాలు, గంజాయి విక్రయ ముఠా సభ్యులు దారుణంగా హత్యకు చేయడం అమానుసమని,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో గంజాయి విక్రయాలను అడ్డుకుంటామని డ్రగ్స్ అంతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని పత్రికలకు ప్రకటనలు విడుదల చేస్తున్నారే తప్ప ఆ దిశగా పోలీస్ శాఖ పనిచేస్తున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. ప్రతినిత్యం ఏదో ఒకచోట గంజాయి, డ్రగ్స్ సేవించి యువత రోడ్లపై తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు సోషల్ మీడియాలో కథనాలు ప్రచురితం అవుతూనే ఉన్నాయని, ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం స్పందించి జిల్లాలో గంజాయి డ్రగ్స్ విక్రయాలను అడ్డుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గంజాయి అమ్ముతున్న ముఠా నాయకులను తక్షణమే అరెస్టు చేసి వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పెంచలయ్య హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కె ఆదిల్ రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి బద్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు యువరాజు, నాగేంద్ర సహాయ కార్యదర్శులు సుధాకర్, భాష దళిత నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా రోహిత్ శర్మ

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా నిలిచాడు. రాంచిలో దక్షిణాఫ్రికా, టీమ్‌ఇండియా మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్ దీనికి వేదికైంది. ప్రేనెలన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో (14.1; 14.2) రోహిత్ రెండు వరుస సిక్స్‌లు బాదాడు. ఈ మ్యాచ్ ముందు వరకు రోహిత్ శర్మ ఖాతాలో వన్డేల్లో 349 సిక్స్‌లున్నాయి. ప్రేనెలన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో వచ్చిన రెండు వరుస సిక్స్‌లతో రోహిత్ శర్మ.. పాకిస్థాన్ బ్యాటర్ షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న అత్యధిక సిక్స్‌ల (351) రికార్డ్‌ను సమం చేశాడు. అనంతరం మార్కో యాన్సన్ బౌలింగ్‌లో (19.4) బౌలింగ్‌లో అతడు అద్భుతమైన సిక్స్ బాదాడు. దీంతో హిట్‌మ్యాన్ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల (352) వీరుడిగా నిలిచాడు. షహిద్‌అఫ్రిదీ, క్రిస్‌గేల్, సనత్ జయసూర్య, ఎంఎస్ ధోనీ వంటి హేమా హేమీలను వెనక్కి నెట్టి ఈ జాబితాలోఅగ్రస్థానానికి చేరాడు.



**ఆ షాట్ రోహిత్ వజ్రాయుధం..!**

సచిన్ ఆన్ డ్రైవ్, విరాట్ ఎక్స్‌ట్రాకవర్ డ్రైవ్, లక్ష్మణ్ ఫ్లిక్, ధోని హెలికాప్టర్ షాట్లను చాలా కళాత్మకంగా ఆడగలరు. కానీ, రోహిత్ అమ్ములో పొదిలో ఓ పవర్ ప్యాక్డ్ షాట్ ఉంది. అదే అతడిని హిట్‌మ్యాన్ చేసింది. అతడి షాట్లలో వజ్రాయుధం లాంటిది. మిగిలిన బ్యాటర్లను ప్రత్యర్థి బౌలర్లు బౌన్సర్లు, షార్ట్‌పిచ్ బాల్స్‌తో భయపెడతారు కానీ.. రోహిత్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఆ బంతులు వేయడానికి యత్నించరు. ఎందుకంటే అతడు తన ఫేవరెట్ షాట్‌ను ప్రయోగిస్తే.. బౌలర్ల గణాంకాలు గల్లంతు కావాల్సిందే. రోహిత్ అమ్ములపొదిలోని ఆ శక్తిమంతమైన ఆయుధం పేరు పుల్ షాట్. సమకాలీన వన్డే క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరూ ఈ ఒక్కషాట్‌తో బాదనన్ని సిక్సర్లను రోహిత్ కొట్టాడు. ఈఎస్పీన్ గణాంకాల ప్రకారం 20152020 మార్చి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 570 పుల్ షాట్లు వాడి రోహిత్ 116 సిక్సర్లను మలిచాడు..!ఆ తర్వాత స్థానంలో ఉన్న ఇయాన్ మోర్గాన్ 294 పుల్ షాట్లు ఆడి కేవలం 47 మాత్రమే సిక్సర్లు మార్చగలిగాడంటే రోహిత్ ఏ స్థాయిలో ఈ షాట్‌ను ఆడాడో అర్థం చేసుకోవచ్చు. క్రికెట్ డాట్‌కామ్ ప్రకారం 2010 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఈ షాట్‌తో వన్డేల్లో రోహిత్ కొట్టిన సిక్సర్ల సంఖ్య 127. ఒక్క వన్డేల్లోనే రోహిత్ చేసిన పరుగుల్లో దాదాపు 19 శాతానికిపై దీని నుంచి రాబట్టినవే.

**కలిసొచ్చిన అద్భుతమైన టైమింగ్..**

రోహిత్ ప్రతిస్పందన వేగం మిగిలిన బ్యాటర్లతో పోలిస్తే చాలా వేగంగా ఉంటుంది. దీంతో అతడికి 'ఎక్స్‌ట్రా సెకండ్' ఉంటుందని కామెంటేటర్లు తరచూ చెబుతుంటారు. దీంతో అతడు బంతిని డీప్‌స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీని దాటించేస్తాడు. కింగ్ కోహ్లీ సైతం ఈ షాట్ ఆడటానికి కొంత అసౌకర్యంగా ఫీలవుతాడు.. అలాంటిది రోహిత్ మాత్రం అలవోకగా ఆడేస్తాడు.






## అహ్మదాబాద్ కామన్వెల్త్ క్రీడలు..
# నిర్వహణ ఖర్చుల అంచనా ఎంతంటే!




గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ క్రీడలు నిర్వహించనున్నారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ సర్వసభ్య సమావేశంలో ఈమేరకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రీడల నిర్వహణ కోసం త్వరలో ఓ ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రూ.3,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల వ్యయంతో ఈ గేమ్స్‌ను నిర్వహించాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మొత్తం ఖర్చు ఖరారు విషయంలో ఇంకా అంచనాలు రూపొందుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గతంలో 2010లో దిల్లీ కామన్వెల్త్ క్రీడలు నిర్వహించారు. ఇది అనేక వివాదాల్లో చిక్కుకుంది. మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం, అవినీతి ఆరోపణలు, ప్రాథమిక అంచనాల కన్నా చాలా ఎక్కువ ఖర్చు కావడం వంటివి జరిగాయి. ఈ క్రీడల నిర్వహణకు రూ.635 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. కానీ.. చివరకు రూ.2,600 కోట్లు దాటింది. మౌలిక సదుపాయాలు సహా అన్ని లెక్కలోకి తీసుకుంటే చాలా పెద్ద మొత్తమని తెలిసింది. ఈ అనుభవాల నుంచి గుజరాత్ అవసరమైన పాఠాలు నేర్చుకోనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. డిసెంబర్ లేదా, వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. దీన్ని లాభాపేక్ష లేని సంస్థగా నమోదు చేయనున్నారు. 2006 మెల్‌బోర్న్ కామన్వెల్త్ క్రీడల్లో ఇదే నమూనాను విజయవంతంగా ఉపయోగించారు. కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సీఈవో, కామన్వెల్త్ స్పోర్ట్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులు, నిపుణులు, అథ్లెట్లు కలిపి 1215 మంది సభ్యులుగా ఉండే అవకాశం ఉంది. 15 17 క్రీడాంశాల్లో 2030 అక్టోబరులో ఈ గేమ్స్ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

## రాణించిన రో-కో..
# దక్షిణాఫ్రికా విజయలక్ష్యం 350


రాంచి వేదికగా టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా జట్లు మొదటి వన్డేలో తలపడుతున్నాయి. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లీ (135; 120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) అద్భుతమైన సెంచరీ చేశాడు. రోహిత్ శర్మ (57, 51 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (60; 56 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. కోహ్లీకి వన్డే కెరీర్‌లో ఇది 52వ సెంచరీ. అలాగే అతడు దాదాపు రెండేళ్ల తర్వాత చేసిన సెంచరీ ఇది. విరాట్ ఇంతకు ముందు చివరిసారిగా 15 నవంబర్ 2023లో వన్డే వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియా మీద 117 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13), అర్షదీప్ సింగ్ (0) విఫలమయ్యారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రీజులోకి వచ్చీరాగానే ఫోర్‌తో ఖాతా తెరిచాడు. క్రీజులో ఉన్నంత సేపు మంచి రిథమ్‌లోనే కనిపించాడు. కానీ దూకుడుగా ఆడే ప్రయత్నంలో జైస్వాల్ (18) నాంద్రే బర్గర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రవీంద్ర జడేజా (32) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఓట్నీల్ బార్ట్‌మన్, నాంద్రే బర్గర్, మార్కో యాన్సెన్, కోర్బిన్ బాష్‌తలో రెండు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు.




## సిమ్ లేకుండా
# వాట్సప్, టెలిగ్రామ్‌లు పని చేయవు

* **90 రోజుల్లో నిబంధన అమల్లోకి..**

సిమ్ లేకపోయినా వాట్సప్, టెలిగ్రామ్ వాడే వాళ్లు చాలా మంది ఉంటారు. వారందరికీ కేంద్రం షాక్ ఇచ్చింది. కమ్యూనికేషన్ యాప్స్ (వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటివి) లో దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈ యాప్సనకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం (డాట్) ఆదేశాలు జారీ చేసింది. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఈ నిబంధనలు 90 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. యాప్‌ను వెబ్ బ్రౌజర్‌లో ఉపయోగిస్తే, ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ సిమ్‌తో లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే



సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# సూక్ష్మ రుణాలు తగ్గుముఖం

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సూక్ష్మ రుణాల జారీ మందగిస్తోంది. కొత్త రుణాల మంజూరు తక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి 36 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 718 జిల్లాల్లో బ్యాంకులు, మైక్రోఫైనాన్స్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు (బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు) జారీ చేసిన సూక్ష్మ రుణాల మొత్తం రూ.3,39,510 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదేకాలం నాటికి ఈ మొత్తం రూ.4,08,049 కోట్లు ఉండటం గమనార్హం. దీంతో పోల్చితే సూక్ష్మరుణాల మొత్తం 16.8 శాతం తగ్గినట్లు తెలుస్తోంది.బిహార్‌లో అధికంగా..: సూక్ష్మ రుణాల మార్కెట్లో మైక్రోఫైనాన్స్ (ఎన్‌బీఎఫ్‌సీ ఎంఎఫ్ఐ) సంస్థలు 39.2 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నాయి. బ్యాంకుల వాటా 31.4 శాతం కాగా, ఎన్‌బీఎఫ్‌సీలకు మిగిలిన వాటా ఉంది. రుణాల జారీలో బిహార్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. తదుపరి స్థానాల్లో తమిళనాడు, ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. సూక్ష్మరుణాల మొత్తం వరుసగా ఆరో త్రైమాసికంలోనూ తగ్గుముఖం పట్టటం గమనార్హం.

## చాట్‌జీపీటీ @3..
# సెర్చ్ గతిని మార్చిన ఏఐ చాట్‌బాట్

2022 నవంబర్ 30.. చాట్‌జీపీటీ అనే ఒక ఏఐచాట్‌బాట్ పుట్టుకొచ్చింది. చూడ్డానికి వాట్సప్ తరహాలో ఓ విండో.. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంటే ఏదో బాట్ అనుకున్నారంతా. కానీ ఆ ఒక్క అడుగు ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేసే తొలి అడుగు అని ఎవరూ ఊహించలేదు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే ఆ ఏఐ చాట్‌బాట్ తీసుకొచ్చిన మార్పేమిటో ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది. ఒకప్పుడు ఏదైనా సందేహం వస్తే గూగుల్‌ను అడిగేవారు. దానికి వందల లింకులు వచ్చేవి. వాటిలో ఏది క్లిక్ చేయాలో తెలిసేది కాదు. అదే సందేహాన్ని చూసి తెలుసుకోవాలంటే యూట్యూబ్‌లో వందలాది వీడియోలు ప్రత్యక్షమయ్యేవి. పదినిమిషాలు చూస్తే గానీ అది ఉపయోగకరమో కాదో అర్థంకాని పరిస్థితి. స్పష్టంగా చెప్తే గానీ అర్థం చేసుకోలేని అలెక్సా వంటి వాయిస్ అసిస్టెంట్లు మరోవైపు. ఆ సమయంలో అడుగుపెట్టింది చాట్‌జీపీటీ. సెర్చ్ గతిని సమూలంగా మార్చేసింది. 'గూగ్లింగ్' అనేవారు కాస్త 'ఆస్క్ చాట్‌జీపీటీ' అనే స్థాయికి వచ్చారంటే ఇది చూపిన ప్రభావం అలాంటిది మరి!




**తొలి అడుగే గట్టిగా..**


శామ్ ఆల్టమన్‌కు చెందిన ఓపెన్‌ఏఐ విడుదల చేసిన ఈ చాట్‌జీపీటీ అనతికాలంలోనే కోట్లమందికి చేరువైంది. తొలి రెండు నెలల్లోనే 10 కోట్ల మంది యూజర్లను సొంతం చేసుకుంది. 2025 నాటికి 80 కోట్ల యూజర్లకు చేరువైంది. ప్రపంచంలోనే అత్యధికంగా వినియోగించే యాప్‌ల జాబితాలో నిలిచింది. అమెరికాలో దీన్ని అత్యధికంగా వినియోగిస్తుండగా.. భారత్ రెండో అతిపెద్ద మార్కెట్. బ్రెజిల్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**గూగుల్ సైతం..**

ఆన్‌లైన్‌లో ఏదైనా వెతకాలంటే ఒకప్పుడు సెర్చ్ ఇంజిన్లే ఆధారం. చాట్‌జీపీటీ ప్రవేశం తర్వాత ప్రజల వెతికే తీరులోనే మార్పు వచ్చింది. ఎవరికైనా తమ వైఫై రౌటర్‌లో సమస్య వస్తే 'ఎలా రిపేర్ చేయాలి' అని గూగుల్‌లో వెతికేవారు. 'అప్పుల ఊబిలోంచి ఎలా బయటపడాలి' వంటి ప్రశ్నలను గూగుల్‌ను అడిగేవారు. ఇప్పుడు ఎలాంటి లింకులూ లేకుండా చాట్‌జీపీటీ అత్యంత వేగంగా సమాధానాలు ఇస్తోంది. దీంతో గూగుల్ వంటి సంస్థలు కూడా సంప్రదాయ సెర్చ్ంజిన్‌కు ఏఐ హంగులు జోడించాల్సి వచ్చింది. తన జెమినైని గూగుల్ సెర్చ్‌లో ఇంటిగ్రేట్ చేసింది. 'ఏఐ ఓవర్‌వ్యూ' పేరుతో సమాధానాలు ఇస్తోంది.

**ఇదీ చాట్‌జీపీటీ గాడి రూల్..**

చాట్‌జీపీటీ దెబ్బకి ఒక్క సెర్చ్ ఇంజిన్ మాత్రమే కాదు.. స్మార్ట్ స్పీకర్లకూ డిమాండ్ క్రమంగా తగ్గుతోంది. అలెక్సా, గూగుల్ హోమ్ వంటి వాయిస్ అసిస్టెంట్ల కొనుగోళ్లు తగ్గుతున్నట్లు ఓ నివేదిక తెలిపింది. చాట్‌జీపీటీ వంటి ఎన్నో చాట్‌బాట్‌లు వచ్చినా యూట్యూబ్ మాత్రం బలంగా నిలదొక్కుకుంది. అయితే, యూట్యూబ్ చూసే తీరుతెన్నులూ మారుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. తొలుత చాట్‌జీపీటీ వంటి ఏఐచాట్‌బాట్‌లను సమాచారం అడిగి.. అదెలా ఫిజికల్‌గా చేయాలో తెలుసుకునేందుకు మాత్రమే యూట్యూబ్‌కు వస్తున్నారట. చాట్‌జీపీటీ లాంచ్ అయిన వెంటనే నిపుణులు ఏఐ వల్ల లక్షలాది ఉద్యోగాలు పోతాయని అంచనా వేశారు. దీని ప్రభావం మొదలైంది. వెబ్ డెవలపర్లు, అనువాదకులు, అమెరికన్ కాలేజీ విద్యార్థుల కోసం ఎస్సేలు రాసే కెన్యా ఫ్రీలాన్సర్లు దీని కారణంగా దెబ్బతిన్నారు. కొలంబియాలో 85% న్యాయమూర్తులు ఉచిత చాట్‌జీపీటీ లేదా మైక్రోసాఫ్ట్ కోపైలట్ ఉపయోగించి కేసులు త్వరగా ముగిస్తున్నారట. మాలిలో ఒక ఏఐ ప్రాజెక్ట్ స్థానిక భాషల్లో పాఠ్యాంశలను అనువదించి చిన్న పిల్లలు త్వరగా నేర్చుకోవడానికి, స్కూలు డ్రాపౌట్లను తగ్గించడానికి సహాయపడుతోందని మరో నివేదిక పేర్కొంది. దక్షిణ కొరియాలో చాట్‌జీపీటీ ఆధారిత రోబోలు వచ్చాయి. ఇవి వృద్ధులకు సహచరులుగా ఉంటున్నాయి. వారితో సంభాషించడం, మందులు వేసుకోవాలని గుర్తు చేయడం వంటి పనులు చేస్తున్నాయి. అత్యవసర సమయాల్లో కుటుంబ సభ్యులకు అలర్ట్ చేస్తున్నాయి. 2024లో 50పైగా దేశాలు ఎన్నికలకు వెళ్లాయి. భాషా అడ్డంకులు దాటి ఓటర్లను చేర్చడానికి చాట్‌జీపీటీ వంటి ఏఐ చాట్‌బాట్‌లు ప్రచార బృందాలు పెద్దఎత్తున వినియోగించాయి.



# సినిమా

# ఎవరిష్టం వారిది

స్టార్ హీరోయిన్ల లిస్టులో ఒకప్పుడు టాప్‌లో నిలిచిన పేరు రకుల్ ప్రీత్ సింగ్. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన క్యూట్ లుక్స్, స్మార్ట్ యాటిట్యూడ్, బబ్లీ ఎనర్జీతో ఫ్యాన్స్ హార్ట్‌ని కొల్లగొట్టింది ఈ పంజాబీ సుందరి. పెండ్లి తర్వాత గ్లామర్ షోతో మరింత రెచ్చిపోతుంది. భగ్నాని కుటుంబం కోడలైన తర్వాత ఆమె లుక్స్ మరింత హాట్‌గా మారాయి. స్టైలింగ్, డ్రెస్ సెన్స్, అందాల ఆరబోతతో పలు ఫొటోషూట్లు చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది. దీని గురించి రకుల్ మాట్లాడుతూ 'సాధారణంగా పెళ్లయితే హీరోయిన్ల పని అయిపోయినట్లే అనే భావన ఉంది. అయితే అది తప్పు. నా విషయంలో అలా జరగడం లేదు. నాకు సంబంధించినంతవరకు అందాల ఆరబోత అనేది వారి వారి ఇష్టాన్ని బట్టి ఉంటుంది. అందం హద్దులను పెండ్లి చెరిపేయదు. పైగా ప్రోత్సహించే నిచ్చెనలా పని చేస్తుంది' అంటూ చెప్పుకొచ్చింది. ఇక రకుల్ సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్‌లో తాజాగా విడుదలైన 'దే దే ప్యార్ దే 2' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. అజయ్ దేవ్‌గణ్ మరోసారి తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించగా, రకుల్ ప్రీత్ సింగ్‌కు ఈ చిత్రం ఎనర్జిటిక్ కమ్‌బ్యాక్‌గా మారింది.





## ఓటీటీలోకి ది గర్ల్‌ఫ్రెండ్

ఓవైపు స్టార్ హీరోలతో కలిసి పాన్ ఇండియాల్లో నటిస్తోన్న రష్మిక మందన్నా మరోవైపు లేడీ ఓరియంటెడ్ మూవీస్ తోనూ మెప్పిస్తోంది.తాజాగా నేషనల్ క్రష్ నటించిన మూవీ 'ది గర్ల్ ఫ్రెండ్'. అందాల రాక్షసి ఫేమ్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో దసరా ఫేమ్ దీక్షిత్ శెట్టి మరో కీలక పాత్ర పోషించాడు. నవంబర్ 7న థియేటర్లలో విడుదలైన ఈ లవ్ ఎంటర్‌టైనర్ సూపర్ హిట్ గా నిలిచింది. చాలా తక్కువ బడ్జెట్ తో రూపుదిద్దుకున్న ఈ సినిమా రూ. 25 కోట్లకు పైగానే కలెక్షన్లు సాధించింది. ఇక ఈ చిత్రంలో భూమా క్యారెక్టర్‌లో రష్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా ఇప్పుడీ 'ది గర్ల్‌ఫ్రెండ్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిసెంబర్ 5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి రానున్నది.ఈమేరకు నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.






## కామెంట్స్ దుమారం

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'కాంతర' 'కాంతార చాప్టర్ 1'లు భారీ విజయాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 'కాంతర'లో తన అద్భుతమైన నటనకు గాను రిషబ్ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నాడు. ఈ సినిమాల్లో పంజుర్లీ దేవతపై తెరకెక్కించిన కొన్ని సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. తాజాగా గోవాలో జరిగిన ఇఫీ వేడుకల్లో పాల్గొన్న బాలీవుడ్ నటుడు రణ్‌వీర్‌సింగ్ కాంతార మూవీ గురించి మాట్లాడాడు. రిషబ్‌శెట్టి అద్భుతంగా నటించారంటూ.. హీరో పాత్రలోకి దెయ్యం ఎంటరైన సన్నివేశాలు బాగున్నాయని కామెంట్ చేశాడు. అదే విధంగా ఆ మూవీలో ఎంతో వైరలైన 'ఓ..' అనే శబ్దాన్ని స్టేజ్‌పై చేసి చూపించాడు. అయితే ఆయన దాన్ని కామెడీగా చేయడంతో కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రణ్‌వీర్ క్షమాపణ చెప్పాలని పోస్టులు పెడుతున్నారు.

## చిరంజీవి అందరినీ సర్‌ప్రైజ్ చేస్తారు

: అనిల్ రావిపూడి



'మన శంకర వరప్రసాద్ గారు'గా ఈ సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి దర్శకుడు ఒక ఈవెంట్‌లో మాట్లాడారు. 'మన శంకర వరప్రసాద్ గారు' అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుందన్నారు. ''గత సంక్రాంతి కంటే ఈసారి డబుల్ బొనాంజ ఉంటుంది. చిరంజీవిని మనం ఎప్పటి నుంచో చూడాలనుకుంటున్న పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు ఎంతో నచ్చిన జానర్. ఆయన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటించి 20 ఏళ్లు దాటింది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఆయన ఈ జానర్‌తో రానున్నారు. గతంలో ఇలాంటి కథల్లో ఆయన ప్రేక్షకుల ముందుకు వచ్చి ఎన్ని బ్లాక్‌బస్టర్లు అందుకున్నారో తెలిసిందే. ఈ సినిమాతో చిరంజీవి అందరినీ సర్‌ప్రైజ్ చేయనున్నారు. ఇప్పటికే 'మీసాల పిల్ల' సూపర్ హిట్ అయింది. త్వరలోనే ఇంకో సాంగ్ విడుదల చేయనున్నాం. షూటింగ్ పూర్తవ్వగానే ప్రచారాన్ని ప్రారంభిస్తాం. ప్రేక్షకుల ఆదరణతోనే ప్రతి సంక్రాంతికి ఒక సినిమాతో పలకరిస్తా'' అని అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ దశలో ఉంది. అనిల్ మార్క్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్. ప్రముఖ నటుడు వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేయనున్నారు. దీంతో అందరిలో ఆసక్తి నెలకొంది.


## వేసవిలో శ్రీలీల ప్రేమ కబుర్లు



తన స్టెప్పులతో యువతను విశేషంగా ఆకట్టుకునే శ్రీలీల.. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ డ్రామాకు అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే తెరపైకి రావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇప్పుడు దీన్ని వచ్చే ఏడాది వేసవి సందర్భంగా మే 1న థియేటర్లలోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భావోద్వేగాలు, సంగీతమే ప్రధాన ఆకర్షణగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ఓ ప్రముఖ సంగీత దర్శకుడు అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు 'తూ మేరి జిందగీ హై' అనే పరిశీలనలో ఉంది. మరి దక్షిణాదిలో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోన్న శ్రీలీల.. కార్తిక్‌తో కలిసి బాలీవుడ్ ప్రేక్షకులకు ఎలాంటి ప్రేమకబుర్లు చెప్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## అనుపమ పరమేశ్వరన్ ప్రతిభతో ప్రయాణం

తన సొగసైన శైలి, భావ వ్యక్తీకరణ కళ్ళు మరియు స్థిరమైన వైఖరికి పేరుగాంచిన అనుపమ, "కార్తికేయ 2", "బటర్‌ఫ్లై" వంటి చిత్రాలలో మరియు నటిగా ఆమె పెరుగుతున్న పరిణతిని హైలైట్ చేసే రాబోయే ప్రాజెక్టులలో పాత్రలతో అభివృద్ధి చెందుతూనే ఉంది. ప్రతి ప్రదర్శనతో, ఆమె కేవలం అందమైన ముఖం మాత్రమే కాదు, అర్థవంతమైన కథ చెప్పడానికి కట్టుబడి ఉన్న కళాకారిణి అని నిరూపిస్తుంది.



# కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత

బెంగళూరు (చిత్రదుర్గం): గత నాలుగు దశాబ్దాలకు పైగా 350 చలన చిత్రాల్లో నటించిన ప్రముఖ కన్నడ హాస్య నటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం ఆసుపత్రిలో చివరిశ్వాస విడిచారు. ఉమేశ్ మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్ సిద్ధరామయ్య, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.బాల నటుడిగా రంగస్థలంపై ఎన్నో ప్రదర్శనలు ఇచ్చిన ఉమేశ్ 1960లో 'మక్కల రాజ్య'తో కన్నడ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. 1976లో వచ్చిన 'కథా సంగమ' విజయాన్ని అందించింది. అక్కడ నుంచి వెనుదిరిగి చూడలేదు. బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా అదే సినిమాగానూ కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డు వరించింది. 'గురు శిష్యారు', 'అపూర్వ సంగమ' తదితర చిత్రాల్లో విభిన్న పాత్రలతో కన్నడ ప్రేక్షకులను అలరించారు. రాజ్‌కుమార్, విష్ణు వర్ధన్, అంబరీశ్, శివాజీ గణేశన్, రజనీకాంత్ తదితర ప్రముఖులతో కలిసి నటించారు. ఆయన ఆఖరి చిత్రం 'డేర్‌డెవిల్ ముస్తఫా' (2023).








# తమ భవిష్యత్ కోసం ఆందోళన బాట

* **భారత శక్తి వార్త ఎఫెక్ట్**

ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి డివిజన్ లోని సాయి నగర్, సత్యనారాయణపురం, విద్యుత్ నగర్, హనుమాన్ నగర్, ఫణిగిరి కాలనీ, మారుతీనగర్ కాలనీ సీనియర్ సిటిజెన్స్ సభ్యులతో టిమ్స్ హాస్పిటల్ లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భవిష్యత్తు తరాల మంచికోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసిఆర్ ని ఒప్పించి ఫ్రూట్ మార్కెట్ స్థలంలో 24 అంతస్తుల టిమ్స్ హాస్పిటల్, పోలీస్ స్టేషన్, పార్క్, సబ్ స్టేషన్, వాటర్ రిజర్వాయర్ మంజూరు చేయడం జరిగింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 24 అంతస్తుల నుంచి 13 అంతస్తులకు కుదించడమే కాకుండా పోలీస్ స్టేషన్, రిజర్వాయర్, సబ్ స్టేషన్ మొత్తానికే లేకుండా జీవో జారీ చేయడంతో చుట్టు పక్కల కాలనీవాళ్లకు భవిష్యత్తు తరాలకు ఉపయోగం లేకుండా పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలను కాలనీవాసులకు వివరించి,తమ భవిష్యత్ తరాల కోసం ఆందోళన చేపట్టాలని తీర్మానం చేశారు.

## రెడ్డి సంఘం చెంగిచెర్ల
# నూతన కమిటీ ఏకగ్రీవం



మేడిపల్లి, నవంబర్ 30 (భారత శక్తి): చెంగిచర్ల రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. రెడ్డి సంఘం చెంగిచర్ల ఆడక్ కమిటీ మోతే రఘు తిరుపతి రెడ్డి, చిర్ర శ్రీధర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన రెడ్డి సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు బొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, కేతిరెడ్డి శశిధర్ రెడ్డి, అధ్యక్షులు బండం వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు సీహెచ్ మోహన్ రెడ్డి,ఆర్ రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.శేఖర్ రెడ్డి, కోశాధికారి సీ. రఘుపాల్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, కో ఆప్షన్ మెంబర్ రంగా బ్రహ్మన్న గౌడ్ నూతన కమిటీ సభ్యులను శాలువలతో సత్కరించారు. నూతన రెడ్డి సంఘం కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం చెంగిచెర్ల కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం కుటుంబ బంధువులు పాల్గొన్నారు.

## ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ నగర శాఖ ఆధ్వర్యంలో
# రాష్ట్ర స్థాయి పోటీలు

* **జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక**
* **విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేసిన కిక్కర గోపీ శంకర్ యాదవ్**

ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): బీరంగూడా బాలాజీ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ స్ట్రాంగెస్ట్ విమెన్ ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ తెలంగాణ ప్రెసిడెంట్ శ్రీమతి ఇంటూరి.రేఖ సారధ్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్ర స్థాయి క్రీడాకారులు అన్ని విభాగాలలో పాల్గొని తమ సత్తా చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై



విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. విజేతలు వచ్చే సంవత్సరం జరగనున్న జాతీయ క్రీడలలో తలపడనున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీసీ చీఫ్ అడ్వైజర్ వరప్రసాద్, ఇండియా ప్రెసిడెంట్ దల్జీత్ సింగ్, చైర్మన్ ఇంటూరి కుమారి, ఆకుల రమాదేవి, మజాద్ ఖాన్, అభిలాష్ బాబ్ డి, అస్లాంషా ఇంకా మాస్టర్లు, రిఫరీలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

* **ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరిక**

ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): నగరంలోని రోడ్లపై వాహనదారులు నిర్లక్ష్యంగా నడుచుకోవడం వల్ల రోజురోజుకూ ప్రమాదాలు పెరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించాడు. విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, వాహన తనిఖీల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కృష్ణయ్య నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమద్ మక్బూల్ జానీ,సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి కృష్ణయ్య మాట్లాడుతూ, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. రోజురోజుకి నగర రోడ్లపై వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. కానీ కొంతమంది వాహనదారులు




హెల్మెట్ లేకుండా, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం. సిగ్నల్స్ పట్టించుకోకుండా దూసుకెళ్లడం వంటి చర్యలతో తమ ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగిస్తున్నారని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా తీవ్ర నేరమని, మైనర్లకు వాహనాలను ఇచ్చి డ్రైవింగ్ చేయించడం కూడా చట్టపరమైన శిక్షార్హమని ఆయన స్పష్టం చేశాడు. తల్లిదండ్రులు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇక సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి లేదా మెసేజ్ పంపి బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీలు అడుగుతారని, వారు చెప్పిన మాటలు నమ్మి సమాచారం ఇవ్వకూడదు. అలాంటి మోసాలు ఆర్థిక దోపిడీలకు దారితీస్తాయని తెలిపారు. అదే విధంగా హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని, యువతలో మాదక ద్రవ్యాల వ్యసనం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత గంజాయికి బానిసలై తమ జీవితాలను చీకటిలోకి నెట్టుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై, వారు ఎవరితో తిరుగుతున్నారు. ఏ ప్రదేశాలకు వెళ్తున్నారు అనే విషయాలను గమనించాలని సూచించారు. ప్రజల సహకారం లేకుండా నేరాలను అరికట్టడం సాధ్యం కాదు. మీ ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి. మీ పేరు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని ఏసీపీ కృష్ణయ్య హామీ ఇచ్చారు. రోడ్లపై నిబంధనలు పాటించండి. హెల్మెట్ ధరించండి. సిగ్నల్స్ వద్ద ఆగండి. మీరే కాదు, మీ కుటుంబం కూడా మీ కోసం ఎదురు చూస్తోంది. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు, ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ మక్బూల్ జానీ, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పది కాలనీల జేఏసీ ప్రతినిధులతో
# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భేటీ



ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): నాగోల్ డివిజన్ పరిధిలోని పది కాలనీల జేఏసీ సభ్యుల కోరిక మేరకు సెవెన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన జేఏసీ కమిటీ (సెవెన్ హిల్స్ కాలనీ,స్వాతి గార్డెన్స్,ద్వారక నగర్, డీ.పీ. నగర్,హిమపురి కాలనీ 1 & 2,సౌత్ ఎండ్ పార్క్,సహారా ఎస్టేట్,జడ్జెస్ కాలనీ,చండీశ్వర్ కాలనీ, ప్రెస్ కాలనీ) వాసుల ప్రతినిధులతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ, పక్కన ఉన్న డంపింగ్ యార్డు వల్ల తీవ్రమైన దుర్వాసనతో అనారోగ్యం బారిన పడుతున్నామని, ముఖ్యంగా రాత్రిపూట రహస్యంగా కెమికల్ వ్యర్థాలు నాలాలో వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఇక్కడి డంపింగ్ యార్డు ప్రాంతంలో అధికారులతో పర్యటించి పరిశీలనలు చేపట్టామని,షెడ్ల స్థితిగతులపై నివేదికలు సేకరించారని గుర్తు చేశారు. అలాగే పరిసర కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామని తెలిపారు.కానీ ప్రస్తుతం అక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అన్నారు. మళ్లీ అధికారులతో చర్చించి మరొక్కమారు గోడౌన్స్ పరిశీలిస్తానని,అక్కడ నిలిచివున్న కాలుష్య నీళ్లు మోటర్ల ద్వారా తొలగిస్తామని హామీ ఇచ్చారు. స్థానికుల సహకారం కూడా ఎంతో ముఖ్యమన్నారు.ఇక్కడ వ్యర్థ రసాయనాలు వెదజల్లే వాహనాలు మీరు పట్టుకొని స్థానిక అధికారులకు,అలాగే మాకు కూడా సమాచారం ఇస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, అలాగే కొన్ని రోజుల క్రితం ఇక్కడ జరుగుతున్న పరిస్థితులను హైడ్రా, పొల్యూషన్ బోర్డు, హైలా,జీహెచ్ఎంసీ,ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చాలా వరకు దుర్గంధ వాసన లేకుండా చేశామని, ఓపెన్ డ్రైన్స్ నిర్మాణ పనుల్లో భాగంగా దాదాపు ఏడు కోట్ల యాభై లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. పనులు ఇప్పటికే పనులు ప్రారంభించారని, సకాలంలో పూర్తి అయితే చుట్టుపక్కల కాలనీవాసులకు దుర్గంధం నుంచి పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందని, ఈ డ్రైన్స్ నిర్మాణ పనుల్లో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని పనులు చేస్తున్నారని, డ్రైన్స్ నిర్మాణ పనుల వల్ల పలువురు కాలనీవాసులకు కొంతమేర ఇబ్బందులు జరుగుతాయని, మీరు కూడా తమ వంతు సహాయ, సహకారాలు అధికారులకు అందివ్వాలని కోరారు. కాలనీవాసులు కూడా తప్పకుండా మా సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొప్పుల విఠల్ రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, జగదీష్ యాదవ్,సతీశ యాదవ్,కత్తుల రాంబాబు, రమేష్, చంద్రారెడ్డి, అంజయ్య, జనార్ధన్,బిక్షం, యాదగిరి, రాజేష్, మధుసూదన్ రెడ్డి,రవికిరణ్ చారి,గోపీకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# గత అనుభవాల పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం, మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అద్భుత పాలసీని జాతికి అంకితం చేస్తున్నట్టు చెప్పారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్ తయారు చేసినట్టు పేర్కొన్నారు. “విజన్ డాక్యుమెంట్ 2047లో విజన్, స్ట్రాటజీ.. రెండు ప్రధాన అంశాలు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పారదర్శక పాలసీలు ఉండాలి. పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుంది. ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ సంస్థల సహకారంతోపాటు విజన్ డాక్యుమెంట్ తయారీలో లక్షలాది మందిని భాగస్వాములను




చేస్తున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. నెట్ జీరో సిటీ, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాలి. కోర్ అర్బన్ రీజియన్‌ను సర్వీస్ సెక్టార్‌గా మారుస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తాం.

# తెలంగాణలో 66 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



హైదరాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): తెలంగాణలో 66 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టుల కోసం డిసెంబర్ 8 నుంచి 29వ తేదీ వరకు తెలంగాణ హైకోర్టు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించనుంది. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 29న రాత్రి 11.59గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. నియామక పరీక్ష తేదీలు, సమయం, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్, కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలోనే హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అందువల్ల అభ్యర్థులు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌ను చెక్ చేసుకోవాలని సూచించారు.

# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన కోహ్లీ... గవాస్కర్ స్పందన

రాంచీ, నవంబర్ 30 : భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న అత్యధిక సెంచరీల రికార్డును అధిగమించి, ఓ ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో అద్భుత శతకం బాదిన కోహ్లీ.. వన్డేల్లో తన 52వ సెంచరీని నమోదు చేశాడు. సచిన్ ఇప్పటివరకు ఓ ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు కొట్టిన ఆటగాడిగా ఉన్నాడు. సచిన్ టెస్టుల్లో 51 సెంచరీలు కొట్టాడు. తాజాగా, ఆ రికార్డును కోహ్లీ అధిగమించాడు. కోహ్లీ వన్డేల్లో 52వ సెంచరీ సాధించడంతో, ఓ సింగిల్ ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా అవతరించాడు. ఈ చారిత్రక ఘనతపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ మ్యాచ్ సందర్భంగా జియో స్టార్‌తో మాట్లాడిన గవాస్కర్.. వన్డేల్లో కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని కొనియాడాడు. "విరాట్ కోహ్లీతో కలిసి ఆడిన వారు, అతనికి వ్యతిరేకంగా ఆడిన వారు.. అందరూ అతడే వన్డేల్లో గ్రేటెస్ట్ అని అంగీకరిస్తారు. రికీ పాంటింగ్ కూడా కోహ్లీని అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించాడు. ఆస్ట్రేలియన్ల నుంచి ప్రశంసలు పొందడం చాలా కష్టం. సచిన్‌ను దాటేశాడంటే, అతని స్థానం ఏంటో అర్థం చేసుకోవచ్చు" అని గవాస్కర్ వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేసి భారీ ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తోడుగా రోహిత్ శర్మ, కెప్టెన్ కేఎల్ రాహుల్ అర్ధ సెంచరీలతో రాణించడంతో, భారత జట్టు దక్షిణాఫ్రికా ముందు 350 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇటీవల కాలంలో కోహ్లీ ఫామ్‌పై కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ, గత నెల ఆస్ట్రేలియా పర్యటనలో రాణించి, ఇప్పుడు స్వదేశంలోనూ అదే జోరును కొనసాగించాడు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి తప్పుకున్న కోహ్లీ, ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించాడు. 2027 ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని కెరీర్‌ను ముగించాలని భావిస్తున్నాడు.

### భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల

## 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

ఢిల్లీ, నవంబర్ 27 (భారత శక్తి): భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు. అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీఫైనల్‌లో ఇరాన్‌పై 33-21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35-28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. "మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

### తెలంగాణ పంచాయతీ ఎన్నికలు..

## తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

హైదరాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్ల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం. అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రికి ప్రకటించే అవకాశం ఉంది. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ. షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి ముగిసిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

### భోగాపురం విమానాశ్రయం సిద్ధం..

## వచ్చే నెలలో ఎగరనున్న తొలి విమానం!

భోగాపురం, నవంబర్ 30 (భారత శక్తి): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తి కాగా, డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారంలో టెస్ట్ ఫ్లైట్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ప్రాజెక్టు పనుల్లో అనూహ్యమైన వేగం కనిపిస్తోంది. ఆయన ప్రతి 15 రోజులకు ఒకసారి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, గడువులోగా విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా నిలిచేలా 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం దాదాపు 99 శాతం పూర్తయింది. టెర్మినల్ భవనం 90%, ఏటీసీ టవర్ 72% పనులు పూర్తి చేసుకున్నాయి. మత్స్యాకారంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ఇంటీరియర్ డిజైన్‌లో ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టును జీఎంఆర్ సంస్థ నిర్మిస్తుండగా, ప్రస్తుతం 5,050 మంది కార్మికులు, ఇంజనీర్లు రేయింబవళ్లు పనిచేస్తున్నారు. విభజన హామీలలో భాగంగా, గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2019లో ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు మందగించాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు తిరిగి ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు 'అల్లూరి సీతారామరాజు' పేరును ఖరారు చేశారు. విశాఖ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకు ప్రత్యేక కనెక్టివిటీ రహదారి, విశాఖ-భోగాపురం మధ్య మెట్రో రైలు మార్గం వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తయితే ఉత్తరాంధ్ర పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.


## 'పేదల సేవలో' కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి..

అమరావతి, నవంబర్ 30 (భారత శక్తి): రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వారే నాయకులుగా రాణిస్తారని ఆయన చెప్పారు. ఈమేరకు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలని నేతలకు తెలిపారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో నాయకుల భాగస్వామ్యం ప్రస్తుతం 25 వేలకు చేరిందని చంద్రబాబు వెల్లడించారు.

### వర్షంలోనూ తిరుమలకు పోటెత్తిన భక్తులు..

## సర్వదర్శనానికి 15 గంటల సమయం

తిరుమల, నవంబర్ 30 (భారత శక్తి): తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. దిత్వా తుపాను ప్రభావంతో తిరుమలలో వర్షాలు కురుస్తున్నా, చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు 14 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు 15 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఒక్కరోజే 79,791 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.73 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలు, చల్లని వాతావరణం ఉన్నప్పటికీ భక్తుల విశ్వాసం ముందు ఇవేవీ అడ్డంకిగా నిలవలేదు. గోవింద నామస్మరణతో క్యూలైన్లలో ఓపికగా నిరీక్షిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.




### టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్..

## 60 రోజుల ముందే టికెట్ బుకింగ్!

హైదరాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్సు ప్రయాణానికి 60 రోజుల ముందుగానే టికెట్లను రిజర్వేషన్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా పండుగలు, సెలవుల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని, ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తమ ప్రయాణ ప్రణాళికలు వేసుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. వాస్తవానికి ఈ 60 రోజుల ముందస్తు బుకింగ్ సదుపాయం గతంలోనూ అందుబాటులో ఉంది. అయితే దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో, పండుగల సీజన్ నేపథ్యంలో దీన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇటీవలి కాలంలో టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'గమ్యం' యాప్ ద్వారా బస్సుల లైవ్ లొకేషన్ తెలుసుకునే సదుపాయం కల్పించింది. అంతేకాకుండా, పలు ప్రధాన రూట్లలో ఏసీ, సీటర్, స్లీపర్ వంటి కొత్త సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చింది. విమాన ప్రయాణం తరహాలోనే బస్సు బయలుదేరే సమయం, స్టాపుల వివరాలు వంటి సమాచారాన్ని ముందుగానే అందిస్తూ ప్రయాణాన్ని సులభతరం చేస్తోంది.

## కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం.. కోట్లలో ఆస్తి నష్టం

జగిత్యాల, నవంబర్ 30 (భారత శక్తి): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వ్యాపారులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గత రాత్రి 11 గంటల సమయంలో కొండగట్టు ఘాట్ రోడ్డులోని అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బొమ్మల దుకాణాల్లో మంటలు చెలరేగాయి. సమీపంలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు భారీ ఎత్తున బొమ్మలను కొనుగోలు చేసి దుకాణాల్లో నిల్వ ఉంచారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. తమ కళ్లెదుటే సర్వస్వం కాలిపోవడంతో వ్యాపారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్యాల, ధర్మపురి సీఐలు రవి, రాంనర్సింహారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

జగిత్యాల, నవంబర్ 30 (భారత శక్తి): ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే భారీ ఆస్తి నష్టం జరిగిందని ఆరోపించారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో సుమారు 30 దుకాణాలు పూర్తిగా కాలిపోయి, దాదాపు కోటి రూపాయల ఆస్తి నష్టం జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం అప్పులు చేసి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. అగ్నిమాపక శకటాలు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోకపోవడమే నష్టం పెరగడానికి ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. జగిత్యాల ఫైరింజన్ మరమ్మతులో ఉండటం, వచ్చిన మరో ఇంజన్ పనిచేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సాయం అందించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కేటీఆర్ అభినందించారు. నష్టపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించకపోతే, పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# దీక్షా దివస్ మన గౌరవం మన గర్వం : దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): దీక్షా దివస్ సందర్భంగా శనివారం గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ బస్ స్టాప్ వద్ద భారాస పార్టీ ఆధ్వర్యంలో, అట్లనే హయత్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా దగ్గర నిర్వహించిన రక్తదాన శిబిరాలు,మెగా హెల్త్ క్యాంపులు, పండ్ల పంపిణీల కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. ఈ దీక్షా దివస్ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ చరిత్రలో తిరుగుబాటు జ్వాల పుట్టిన రోజు 2009 నవంబర్ 29 నాడు, కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న ఒక్క మాటతో లక్షలాది మంది హృదయాలు ఒక్కటయ్యాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం, వారి గౌరవం కోసం,వారి భవిష్యత్తు కోసం భావి తరాల బతుకల కోసం ఉద్యమ నేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష...





అదే ఈ రోజున ప్రారంభమైన ప్రజా శక్తి జ్వాల తెలంగాణ కోసం ఆయన శ్వాస, తెలంగాణ కోసం ఆయన జీవితం, తెలంగాణ కోసం ఆయన పోరాటం, దీక్షా దివస్ మన గౌరవం, మన గర్వమని, నీళ్లు, నిధులు, నియామకాలు మన సొంతమని సుధీర్ రెడ్డి అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రథమ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భవాని ప్రవీణ్ కుమార్, సామ తిరుమల రెడ్డి, రమేష్ ముదిరాజ్,డివిజన్ల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, చెన్నగొని శ్రీధర్ గౌడ్,మల్లీశ్వరి రెడ్డి, భాస్కర్ సాగర్,శ్రావణ్, అంజలీ, రమణారెడ్డి,రాము, యాద శంకర్, స్కైలాబ్,ప్రదీప్, రాకేష్, పారంద రమేష్,సత్తిరెడ్డి, శ్రీకాంత్, రాధిక,లక్ష్మణ్, ఇంద్రకరణ్,విక్కీ, విజయ, మధు,వర్షిత్, వాణి, నాగమణి, లక్ష్మీ,నగేష్, దేవరం నాయక్, శంకర్ నాయక్, రాజు నాయక్ పలువురు భారాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి

ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): రాచకొండ కమిషనరేట్ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపేట చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ రాయుడు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణతో కలిసి విధుల్లో పనిచేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అప్పారావు (9968)పై ద్విచక్ర వాహనదారుడు అథెర్ ఎలక్ట్రిక్ బైక్ (టీజీ 07డి9744) నడుపుతున్న భరత్ వెనుక నుండి రాయితో రక్తం వచ్చేలా ఎడమ కన్ను భాగాన దాడి చేశాడు. స్థానికులు దెబ్బ తగిలిన కానిస్టేబుల్ అప్పారావును పక్కనే ఉన్న ఓమ్ని హాస్పిటల్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విధుల్లో భాగంగా కానిస్టేబుల్ అప్పారావు హెల్మెట్ లేదని వాహనం నడుపుతున్న భరత్ బైక్ పై చలాన్ వేసాడు. వాహనదారుడు బైక్ ను అక్కడే వదిలేసి 15 నిమిషాల తర్వాత వచ్చి చలాన్ వేయడం పట్ల అసహనం చెందిన భరత్, కానిస్టేబుల్ అప్పారావుపై దాడి చేసి గాయపర్చి పోలీసుల కంప్యూటర్ ట్యాబ్‌ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇంత తతంగం అయిన తరువాత



స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకి అప్పగించారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ను రక్తం వచ్చేలా కొట్టినందుకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సరూర్ నగర్ సీఐ సైదిరెడ్డి వెల్లడించారు.

## నిలోఫర్, ఎంఎన్జే ఆస్పత్రుల వద్ద 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ అన్నదానం

హైదరాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): ఆకలితో అల్లాడుతున్న వారికి, ఆసుపత్రిలో రోగులకు సహాయకులుగా వచ్చిన వారికి అండగా నిలుస్తూ 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ ఆధ్వర్యంలో నిలోఫర్, ఎంఎన్జే ఆస్పత్రుల వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రుల వద్దకు వచ్చిన 300 మందికి పైగా పేదలకు, రోగుల సహాయకులకు భోజనం అందించారు. సీనియర్ జర్నలిస్ట్ అంజలి, ఆర్‌జే రాజ్ , నటుడు విజయ భాస్కర్, గాంధీ మిర్యాల, శ్రీదేవి తదితరులు పాల్గొని పేదలకు భోజనాలు వడ్డించారు. ప్రతి ఆదివారం హైదరాబాద్‌లోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరాటంకంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పేదలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఈ అన్నవితరణ సేవలను కొనసాగిస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ తెలిపారు.వాలెంటీర్స్ చైతన్య



రాజు, లక్ష్మణ్, సైదులు, బాలకృష్ణ, పురుషోత్తం పాల్గొన్నారు. ఈ నిరంతర సేవ కార్యక్రమంలో వాలంటీర్లుగా పాల్గొనాలనుకునే వారు లేదా ఈ సేవలకు సహకరించాలనుకునే వారు ఫోన్ : 87908 15527 తమను సంప్రదించాలని పెద్ది శంకర్ కోరారు.







## వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మీర్ పేట్, నవంబర్ 30 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్ పేట్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నందిహిల్స్‌కు చెందిన జూలూరు సైదులు, లెనిన్ నగర్‌కు చెందిన పుల్లయ్య, నేదునూరుకు చెందిన దేవరకొండ అంజయ్యలకు ట్రై సైకిళ్లను మాజీ మంత్రివర్యులు,మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం బాధ్యత మాత్రమే కాక, సామాజిక బాధ్యత కూడా అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి సేవ చేయడం కొనసాగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, శీను నాయక్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రజాక్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, రాళ్లబండి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నెక్లెస్ రోడ్‌లో 'సంవిధాన్ శక్తి' పేరిట రన్

హైదరాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): నగరంలోని నెక్లెస్ రోడ్‌లో 'సంవిధాన్ శక్తి' పేరిట రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్‌భీమపాక పాల్గొన్నారు. ఏక్ నయా దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3K, 5K రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడారు. "మీ పేరు ఒకసారి ఎఫ్ఐఆర్‌లో నమోదైతే మీ బంగారు భవిష్యత్ నాశనం అవుతుంది. భవిష్యత్ బంగారుమయం చేసుకోవాలంటే చెడు వ్యసనాలకు దూరం ఉండాలి. డ్రగ్స్ పెడ్లర్‌గా యువతను మార్చడమే లక్ష్యంగా కొన్ని ముఠాలు ఉంటాయి. యువత వాటి బారిన పడొద్దు. మెడిటేషన్ చేస్తే అన్ని డ్రగ్స్‌ను మించిన కిక్ ఉంటుంది. చిన్నపిల్లలకు కూడా డ్రగ్స్ అలవాటు చేస్తున్న వారిని చూస్తే ఆందోళన కలుగుతోంది. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి" అని అన్నారు.

## హుస్నాబాద్‌ను ఉత్తర తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం

హుస్నాబాద్, నవంబర్ 30 (భారత శక్తి): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా, ఉత్తర తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డిసెంబర్ 3న హుస్నాబాద్‌లో జరిగే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభా స్థలిని పరిశీలించిన మంత్రి పొన్నం.. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. "సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా.. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు బస్సులు ఇస్తాం. విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నాం. హైదరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభిస్తాం. హుస్నాబాద్‌లో రింగురోడ్డు, కబడ్డీ అకాడమీ, తాగునీటి సౌకర్యం, స్టేడియం అభివృద్ధి, డిగ్రీ కాలేజీ సమీపంలోని స్థలంలో పార్క్, మార్కెట్ యార్డ్, కాటన్ మార్కెట్ అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా సీఎంను కోరనున్నాం.



## వీవీ కార్ వాషింగ్ సెంటర్ ప్రారంభించిన కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 30 (భారత శక్తి): హయత్‌నగర్ లోని కట్ట మైసమ్మ కాలనీలో కొత్తగా ప్రారంభమైన వీవీ కార్వాషింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, హయత్ నగర్ సీఐ నాగరాజ్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ,స్థానికంగా చిన్న వ్యాపారాలు, సేవల రంగాలు అభివృద్ధి చెందడం ప్రగతి కొరకు చాలా ముఖ్యమని ఇలాంటి కేంద్రాలు యువతకు ఉపాధి అవకాశాలను అందించడంలో, కాలనీలో సౌకర్యాలను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయి. హయత్‌నగర్ ప్రాంతంలో వ్యాపార అభివృద్ధి, సామాజిక సేవలను ప్రోత్సహించడం మా ప్రధాన లక్ష్యం. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచి అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.